


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 332, పేజీలు - 08




శుక్రవారం, మే 22, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# భగీరథ్‌ను అప్పగించలేదు.. పోలీసులే అరెస్ట్ చేశారు

- అప్పా జంక్షన్ తనిఖీల్లో బండి భగీరథ్ అరెస్ట్ - లొంగిపోయారనే ప్రచారాన్ని ఖండించిన రేవంత్
- పోలీసుల దర్యాప్తు సమాచారానికే ముఖ్యమంత్రి మద్దతు - మైనర్ బాలిక అంశంపై రాజకీయాలను తప్పుబట్టిన సీఎం
- కేసీఆర్ ఎక్కడ నిద్రపోతున్నారు? అని ప్రశ్న - బాలికను అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నారని ఫైర్
- కేటీఆర్ మనిషిలా ప్రవర్తించడం లేదని మండిపాటు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలోనే కాకుండా యావత్ దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన బండి భగీరథ్ కేసు ఇప్పుడు తెలంగాణ రాజకీయ పార్టీల మధ్య తీవ్ర మాటల యుద్ధానికి కారణం అవుతోంది. ఈ కేసులో బండి భగీరథ్‌ను బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కాపాడుతున్నాయంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవలె బండి భగీరథ్ కేసుపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీపై తీవ్రంగా మండిపడ్డారు. ఈ కేసులో మైనర్ బాలికను అడ్డుపెట్టుకుని కేటీఆర్ రాజకీయాలు చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.

ఈ కేసులో తన కుమారుడిని తానే పోలీసులకు అప్పగించానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చెబుతుండగా తామే అరెస్ట్ చేశామంటూ పోలీసులు ప్రకటించారు. దీంతో అసలు బండి భగీరథ్ అరెస్ట్‌కు సంబంధించి గత కొన్ని రోజులుగా తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ క్రమంలోనే స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి పోక్సో కేసులో బండి భగీరథ్‌ను బండి సంజయ్ అప్పగించలేదని పోలీసులే అరెస్ట్ చేశారని క్లారిటీ ఇచ్చారు. పోక్సో కేసులో చట్ట ప్రకారమే బండి భగీరథ్ అరెస్ట్ జరిగిందని స్పష్టం చేశారు.బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో పోలీసులు పద్ధతి ప్రకారం దర్యాప్తు చేస్తున్నారని ఫిర్యాదు వచ్చిన వెంటనే భగీరథ్ కేసులో చర్యలు తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భగీరథ్ లొంగిపోలేదని పోలీసులు అతడిని అరెస్టు చేశారని స్పష్టం చేశారు. తనిఖీల్లో బండి భగీరథ్ దొరికాడని పోలీసులు చెప్పారని నేను పోలీసుల మాటలనే నమ్ముతున్నానని చెప్పారు. గురువారం సచివాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన బండి భగీరథ్?పై నమోదైన పోక్సో కేసులో

2లో..




# విజయ్ క్యాబినెట్ విస్తరణ

- కొత్తగా 23 మందికి క్యాబినెట్‌లో విజయ్ చోటు
- కాంగ్రెస్ నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలకు పదవులు
- ప్రమాణస్వీకారంలో రాహుల్ గాంధీ పేరు ప్రస్తావన




చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి జోసెఫ్ విజయ్ తన మంత్రివర్గాన్ని గురువారం విస్తరించారు. దీంతో కొత్త మంత్రులు ప్రమాణస్వీకారం గురువారం రాజ్‌భవన్‌లో జరిగింది. ఇదిలా ఉండగా, తమిళనాడులో దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత కాంగ్రెస్‌కు ప్రభుత్వంలో ప్రాతినిధ్యం దక్కింది. 1967 తర్వాత కాంగ్రెస్ పార్టీ తమిళనాడు ప్రభుత్వంలో భాగస్వామి కావడం ఇదే మొదటిసారి. ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంలో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాష్ట్ర మంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. అయితే, ఈ సందర్భంగా ఒక చిన్న వివాదం నెలకుంది. మంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎస్. రాజేష్ కుమార్ పోడియంపై నుంచి తమ పార్టీ అగ్రనేతల పేర్లను ప్రస్తావించి, వారికి జైకొట్టారు. ఇది

2లో..

# బండి భగీరథ్ పోక్సో కేసులో కొత్త ట్విస్ట్

- బెయిల్ పిటిషన్ వెనక్కి, అదనపు సెక్షన్లు నమోదు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన బండి భగీరథ్ పోక్సో కేసులో అతని తరఫు లాయర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. బండి భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు తెలంగాణ హైకోర్టులో ఆయన లాయర్ మెమో ఫైల్ చేశారు. బండి భగీరథ్ అరెస్ట్‌కు ముందే ఈ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టులో దాఖలు చేయగా దానిపై వాదనలు విన్న ధర్మాసనం తీర్పును వెల్లడిస్తామని తెలిపింది. ఈలోపే బండి భగీరథ్ అరెస్ట్ కావడంతో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసినప్పటికీ దాంతో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఈ క్రమంలోనే ఆ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను వెనక్కి తీసుకోనున్నారు. మరోవైపు ఈ పోక్సో కేసులో సిట్ అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఇప్పటికే బాధిత బాలిక, ఆమె తల్లితో మాట్లాడిన సిట్ అధికారులు వారు ఇచ్చిన సమాచారం ఆధారంగా కేసును విచారణ చేస్తున్నారు. అదే సమయంలో

2లో..

# కార్మికులకు రేవంత్ సర్కార్ శుభవార్త

- కనీస వేతనాలు పెంపు, 1.11 కోట్ల మందికి మేలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలోని కార్మికులకు రేవంత్ రెడ్డి సర్కార్ వరాల జల్లు కురిపించింది. వారికి అందే కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ వేతనాల పెంపు జూన్ 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారు. ఈ నిర్ణయంతో తెలంగాణలోని

2లో..

# స్త్రీ శక్తి థీమ్‌తో మహానాడు-2026

## - పార్టీ అగ్రనేతలతో చంద్రబాబు సమావేశం



- 20 తీర్మానాలను చేపట్టాలని టీడీపీ పొలిట్ బ్యూరోలో నిర్ణయం
- "కార్యకర్తే అధినేత" అనేలా కార్యక్రమం ఉండాలని చంద్రబాబు సూచన
- మహిళలు, బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ నేతలకు ఆదేశం
- హైబ్రిడ్ విధానంలో జరిగే మహానాడుకు 19 తీర్మానాలకు ఆమోదం

**అమరావతి (ప్రశ్న న్యూస్)** తెలుగుదేశం పార్టీ వార్షిక పండుగ మహానాడు నిర్వహణపై ఆ పార్టీ అగ్రనాయకత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ ఏడాది మే 27, 28 తేదీల్లో నిర్వహించనున్న మహానాడు-2026 ను స్త్రీ శక్తి థీమ్‌తో చేపట్టాలని గురువారం జరిగిన టీడీపీ పొలిట్ బ్యూరో సమావేశంలో నిర్ణయించారు. ఇంధన పొదుపు కారణంగా ఆధునిక సాంకేతికతను జోడిస్తూ ఈ సమావేశాన్ని పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ పద్ధతిలో నిర్వహించారు.

### స్త్రీ శక్తి థీమ్‌తో పండుగలా నిర్వహణకు టీడీపీ సిద్ధం!

పార్టీ ఆవిర్భావం నుండి మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్న తెలుగుదేశం పార్టీ, ఈసారి మహానాడును పూర్తిగా మహిళా శక్తిని ప్రతిఫలించేలా నిర్వహించాలని నిర్ణయించింది. వర్చువల్‌గా జరిగిన పొలిట్ బ్యూరో భేటీలో సీఎం చంద్రబాబు టీడీపీ హయాంలో మహిళలకు కల్పించిన ఆస్తి హక్కు, రాజకీయ ప్రాతినిధ్యం , ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాల్లో మహిళల భాగస్వామ్యాన్ని ప్రధానంగా చర్చించాలని

2లో..

# చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు

- వై.ఎస్ జగన్ హాట్ కామెంట్స్

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో పాలన పూర్తిగా గాడి తప్పిందన్నారు వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్. చంద్రబాబు క్రిమినల్ బ్రెయిన్‌తో వైసీపీ నేతలే టార్గెట్‌గా రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల నాటికి ఆయన యాక్టీవ్‌గా ఉండరని, అందుకే నీతిమాలిన రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు.

చంద్రబాబు ఆఖరి పాలన సమయంలోనైనా ప్రజలకు మంచి చేయాలని జగన్ సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పెట్రోల్ ధరలు తగ్గించాలని లీటర్‌పై 8 రూపాయల వరకు తగ్గించాలని డిమాండ్ చేశారు.

2లో..



# మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయం చేస్తే సహించం

- రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించిన రేవంత్ రెడ్డి
- స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లకు నాంది పలికింది రాజీవ్ అని కితాబు
- సోనియాగాంధీ వల్లే తెలంగాణ వచ్చిందని వ్యాఖ్య
- గాంధీ కుటుంబానికి తెలంగాణ సమాజం ఎంతో రుణపడి ఉంది

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప నాయకుడు దివంగత మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి స్ఫూర్తితో తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం

2లో..



# పుల్వామా దాడి మాస్టర్‌మైండ్ ఖతం

- పీఓకేలో 'అజ్ఞాత వ్యక్తుల' ఆపరేషన్!



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) 2019 పుల్వామా ఉగ్రదాడి మాస్టర్‌మైండ్స్‌లో ఒకడైన హంజా బుర్హాన్ అలియాస్ 'డాక్టర్' హతమయ్యాడు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ రాజధాని ముజఫరాబాద్‌లో గుర్తుతెలియని సాయుధులు జరిపిన కాల్పుల్లో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

### చదువు పేరుతో వెళ్లి ఉగ్రవాదిగా

హంజా బుర్హాన్ అసలు పేరు అర్జుమంద్ గుల్జార్ దార్. పుల్వామా జిల్లా రత్నిపోరా ప్రాంతానికి చెందిన అతడు 2017లో ఉన్నత చదువుల కోసమంటూ పాకిస్థాన్ వెళ్లాడు. అక్కడ నిషేధిత ఉగ్రవాద సంస్థ 'అల్-బదర్'లో చేరి కమాండర్‌గా ఎదిగాడు. తర్వాత కశ్మీర్‌లోని యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించడానికి, వారిని తీవ్రవాదులుగా మార్చడానికి దక్షిణ కశ్మీర్‌లో పెద్ద నెట్‌వర్క్ నడిపినట్లు రికార్డులు చెబుతున్నాయి.

### పేలుడు పదార్థాలు సరఫరా

2019 ఫిబ్రవరి 14న

2లో..

# కాళేశ్వరంలో సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభం

- తొలి పుణ్యస్నానం ఆచరించిన కంచి పీఠాధిపతి, మంత్రులు
- 12 రోజుల పాటు కొనసాగనున్న పుష్కర వేడుకలు
- గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల పవిత్ర త్రివేణి సంగమం ఇది
- భక్తుల కోసం ప్రభుత్వం భారీ ఏర్పాట్లు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో సరస్వతీ అంత్య పుష్కరాలు ఈ రోజు ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. కంచి మఠం పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి తొలి పుణ్యస్నానం ఆచరించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు. ఉదయం 5:43 గంటలకు ఆయనతో పాటు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు దంపతులు పవిత్ర స్నానం చేశారు. తెలంగాణలో

2లో..

# నిప్పుల కుంపటిగా తెలుగు రాష్ట్రాలు

- పిడుగురాళ్లలో 48.1 డిగ్రీలు
- పెద్దపల్లిలో 46.5 డిగ్రీలు నమోదు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలుగు రాష్ట్రాలు నిప్పుల కుంపటిగా మారుతున్నాయి. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండటంతో రెండు రాష్ట్రాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 8 గంటలకే

2లో..

# పంట కొనుగోళ్ల సంక్షోభం.. రేవంత్ కు కేటీఆర్ బహిరంగ లేఖ

- కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారన్న కేటీఆర్
- 10 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన
- గన్నీ బ్యాగుల కోసం రైతుల నుంచి డిపాజిట్ వసూలు చేస్తున్నారని మండిపాటు
- రైతు ద్రోహిగా రేవంత్ మిగిలిపోతారని వ్యాఖ్య

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ప్రస్తుతం పంట కొనుగోళ్ల సంక్షోభం నెలకొందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంకా ఎంతకాలం మొద్దునిద్ర పోతారని ప్రశ్నిస్తూ ఆయనకు ఒక బహిరంగ లేఖ రాశారు. ఈ నెల 23న జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలోనైనా ప్రభుత్వం కళ్లు తెరిచి, అన్నదాతల సమస్యలపై

2లో..



# ఎస్వీ గోశాలలో నెయ్యి తయారీ కేంద్రం పనుల పరిశీలించిన : జె ఈ ఓ డా. ఎ. శరత్

**జూలై నాటికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, నెయ్యి తయారీ కేంద్రం పనులు పూర్తి చేయాలి : టిటిడి జేఈవో (వైద్యం, విద్య) డా. ఎ. శరత్**

తిరుపతి(ప్రశ్న న్యూస్) టిటిడి ఎస్వీ గోశాలలో నిర్మాణంలో ఉన్న నెయ్యి తయారీ కేంద్రం, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పనులను టిటిడి జేఈవో (వైద్యం, విద్య) డా. ఎ. శరత్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, టిటిడి ఈవో ఎం. రవిచంద్ర ఆదేశాల మేరకు పెండింగ్ పనులను సమీక్షించామని తెలిపారు. నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో చేపడుతున్న సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ పనులను మరియు చివరి దశలో ఉన్న నెయ్యి తయారీ కేంద్రం పెండింగ్ పనులు జూలై నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్వీ గోశాలలో రోజుకు సుమారు 2 వేల లీటర్ల పాలను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎస్వీ గోశాల నుండి సేకరించే పాలను వినియోగించి స్వామివారి కైంకర్యాలు, సేవల కోసం పాలు, పెరుగు, నెయ్యి తదితర ఉత్పత్తులను టిటిడి స్వయంగా తయారు చేసేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.అదేవిధంగా, నెయ్యి తయారీ ప్లాంట్ పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయని, వెంటనే ట్రయల్ రన్ నిర్వహించి మిగిలిన పనులను పూర్తి చేయాలని సూచించారు. పాలు ఇచ్చే దేశీయ ఆవులను మరింతగా సమీకరించేందుకు చర్యలు చేపట్టాలని, టిటిడి తరఫున చేపట్టాల్సిన నీరు, విద్యుత్, ఫ్యాన్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, లైటింగ్, సైన్ బోర్డులు తదితర మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా మజ్జిగ, వెన్న తయారీ అనంతరం వెన్న నుండి నెయ్యి ఉత్పత్తి చేసే ప్రక్రియలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్వామివారి ధూప, దీప, నైవేద్య కార్యక్రమాలకు వినియోగించే నెయ్యిని ఎస్వీ గోశాల నుండే సరఫరా చేసేలా పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ యూనిట్ ద్వారా రోజుకు 2 వేల లీటర్ల పాల నుండి సుమారు 80 కిలోల నెయ్యి తయారు చేసే అవకాశం ఉందని, దశలవారీగా యూనిట్ సామర్థ్యాన్ని 10 వేల లీటర్ల వరకు పెంచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని జేఈవో



వెల్లడించారు.ఈ కార్యక్రమంలో టిటిడి ఎస్వీ గోశాల డైరెక్టర్ డా. ఏవీఎన్ శివకుమార్, ఎస్ఈలు వేంకటేశ్వర్లు, మనోహరం, ఈఈ ప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

- **భక్తుల సౌకర్యార్థం టీటీడీ విస్తృత ఏర్పాట్లు**
- **శ్రీవారి సేవకుల ద్వారా నిరంతరాయంగా తాగునీరు, అన్న ప్రసాదాల పంపిణీ**
- **రేడియాడబ్రాడ్ కాస్టింగ్ ద్వారా 5 భాషల్లో భక్తులకు దర్శన సమాచారం**
- **వేసవి వేడికి ఇబ్బంది కలగకుండా చలువ పందిళ్ల ఏర్పాటు**





తిరుమల (ప్రశ్న న్యూస్ ) వేసవి రద్దీ నేపథ్యంలో శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో గురువారం తిరుమలలో భక్తుల రద్దీ నెలకొనడంతో భక్తుల సౌకర్యార్థం టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది.భక్తులకు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కల్పించేందుకు బాటగంగమ్మ సర్కిల్ నుండి గోగర్భం డ్యామ్ సర్కిల్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్ వరకు చలువ పందిళ్లు ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2, మ్యూజియం ప్రాంగణం, నారాయణగిరి ఉద్యానవనాల్లో నీడనిచ్చే షెల్టర్లు ఏర్పాటు చేశారు. క్యూ లైన్లలో వేచి ఉండే భక్తుల కోసం కూల్ పెయింటింగ్ పనులు, అదనపు తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేశారు.ముఖ్యంగా శ్రీవారి ఆలయం పరిసరాలు, లడ్డూ కౌంటర్లు, భక్తుల రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతాల్లో చలువ పందిళ్ల నిర్మాణం చేపట్టారు. ఇదే సమయంలో నాలుగు మాడ వీధుల్లో సింథటిక్ ఎనామెల్ కూల్ పెయింట్ వేయడం ద్వారా భక్తులు నేల వేడి నుండి ఉపశమనం పొందేలా చర్యలు తీసుకున్నారు. బాట గంగమ్మ గుడి సర్కిల్ నుండి ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఏర్పాటు చేసిన క్యూలైన్లలో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.టీటీడీ అన్న ప్రసాద విభాగం ఆధ్వర్యంలో శ్రీవారి సేవకుల ద్వారా క్యూలైన్లలోని భక్తులకు నిరంతరాయంగా తాగునీరు, అన్న ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. ఉదయం అల్పాహారంగా పాలు ఉప్మా, పొంగల్, మధ్యాహ్నం సాంబారన్నం, పులిహోర, టమోట రైస్, రాత్రి పాలు ఉప్మా, సాంబారన్నం భక్తులకు నిరంతరాయంగా పంపిణీ చేయడం జరుగుతోంది.అదేవిధంగా టీటీడీ ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో తిరుమలలో రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శ్రీవారి సేవకుల ద్వారా భక్తులకు మొబైల్ వాటర్ డ్రమ్ములతో ఎప్పటికప్పుడు తాగునీరు పంపిణీ చేయడం జరుగుతోంది.రద్దీకి అనుగుణంగా ఔటర్ రింగ్ రోడ్డులో క్యూలైన్ల వెంబడి ఒక మొబైల్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ అందుబాటులో ఉంచడం జరిగింది.తిరుమలలో పరిమిత సంఖ్యలో వసతి గదులు నిర్మించబడ్డాయి. దీంతో 60వేల మంది భక్తులకు మించి తిరుమలలో వసతి కేటాయించడానికి వీలుపడదు. ప్రస్తుతం తిరుమలలో దాదాపు 7500 గదులు, ఐదు యాత్రికుల వసతి సముదాయాలు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. గదులు పొందలేని భక్తులు తిరుమలలోని పీఏసీ-1, పీఏసీ-2, పీఏసీ-3, పీఏసీ (పద్మనాభ నిలయం), పీఏసీ-5 లలో ఉన్న దాదాపు తొమ్మిదివేల లాకర్లు అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ కూడా భక్తులతో కిక్కిరిసి ఉన్నాయి.తిరుమలలో భక్తులు స్వామివారికి తలనీలాల సమర్పణ కోసం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఇందులో ప్రధాన కల్యాణకట్టతో 11 మినీ కల్యాణ కట్టలు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. నిరంతరాయంగా క్షురకులు భక్తులకు సేవలు అందిస్తున్నారు. గత ఐదు రోజుల్లోనే 4,32,213 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోవడం విశేషం. ఇందులో అత్యధికంగా మే 16, 17వ తారీఖుల్లో 90 వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకోవడం జరిగింది. అదేవిధంగా గత ఐదురోజుల్లో తలనీలాలు సమర్పించే భక్తుల సంఖ్య కూడా విపరీతంగా పెరిగింది. అత్యధికంగా మే 18, 19, 20వ తారీఖుల్లో 43 వేలకు పైగా భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించడం విశేషం. అదేవిధంగా గత ఐదురోజుల్లో తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో దాదాపు 19 లక్షలకు పైగా భక్తులకు అన్న ప్రసాదాలు, టీ, కాఫీ, పాలు, మజ్జిగ అందించడం జరిగింది.వేసవి తీవ్రత దృష్ట్యా భక్తులకు నీడ, చల్లని వాతావరణం, తాగునీరు, అన్న ప్రసాదాలు, పరిశుభ్రత, వసతి, తలనీలాల సమర్పణ, లడ్డూలు వంటి అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు అందించడం కోసం టీటీడీ యంత్రాంగం విశేష కృషి చేస్తోంది.కాగా వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది దర్శన క్యూలైన్లు, నారాయణగిరి షెడ్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని కంపార్ట్మెంట్ లను నిరంతరాయంగా పర్యవేక్షిస్తూ రాత్రింబవళ్లు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శ్రమిస్తున్నారు.

# మే 22న శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ: టిటిడి

**శిల్పకళ, భక్తి, సంప్రదాయాల సమ్మేళనంగా దివ్యక్షేత్రం**

**ఒకే ప్రాంగణంలో మూడు దివ్య రూపాల్లో శ్రీమహావిష్ణువు దర్శనం**

**రుణ విమోచనం ప్రసాదించే మహిమాన్విత క్షేత్రం శ్రీ గోవిందరాజస్వామి ఆలయం**



తిరుపతి (ప్రశ్న న్యూస్) శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో మే 23 నుండి 31వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు మే 22న శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించనున్నారు. సాయంత్రం 5.30 నుండి 8 గంటల మధ్య ఈ కార్యక్రమం వైభవంగా జరుగనుంది.ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాల, సహస్రనామార్చన సేవలు నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం సేనాధిపతి ఉత్సవం, గంగుంద్ర మండపంలో ఆస్థానం, యాగశాలలో శాస్త్రోక్త అంకురార్పణ కార్యక్రమాలు జరుగుతాయి.

## ఆలయ ప్రాశస్త్యం

కలియుగ వైకుంఠమైన తిరుపతిలో వెలసిన శ్రీ గోవిందరాజ స్వామివారి ఆలయం భక్తి, చరిత్ర, శిల్పకళ, ఆగమ సంప్రదాయాల సమ్మేళనంగా యుగయుగాలుగా భక్తులను ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తోంది. ఈ దివ్యక్షేత్రాన్ని దర్శించుకున్న భక్తులకు రుణ విమోచనం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక ఆనందం కలుగుతాయని స్థల పురాణం పేర్కొంటోంది. స్వామివారి దివ్య మంగళ విగ్రహం భక్తుల హృదయాలలో విశ్వాసాన్ని నింపుతూ, జీవన సాఫల్యానికి మార్గదర్శకంగా నిలుస్తోంది.

## స్థల పురాణ వైభవం

పురాణాల ప్రకారం, శ్రీ మహావిష్ణువు భూలోకంలో శ్రీనివాసుడిగా అవతరించి తిరుమలలో నివసించే సమయంలో వివాహ మహోత్సవం నిమిత్తం కుబేరుని వద్ద నుండి ధనం అప్పుగా తీసుకున్నారని విశ్వసిస్తారు. ఆ ధనాన్ని కొలిచే బాధ్యతను శ్రీనివాసుడి అన్నయ్య అయిన శ్రీ గోవిందరాజ స్వామివారికి అప్పగించారని స్థల పురాణం తెలియజేస్తోంది. ధనాన్ని కొలుస్తూ అలసిన స్వామివారు ఆదిశేషునిపై శయనించిన దివ్య రూపమే నేటి శ్రీ గోవిందరాజ స్వామివారి దర్శనమని భక్తుల విశ్వాసం.

## గర్భాలయంలో దివ్య దర్శనం

ఆదిశేషునిపై శయనిస్తున్న స్వామివారు గర్భాలయంలో దివ్య కాంతులతో దర్శనమిస్తూ భక్తుల హృదయాలకు ప్రశాంతతను ప్రసాదిస్తున్నారు. స్వామివారి నాభి నుండి బ్రహ్మదేవుడు ఉద్భవించినట్లు, పాదాల వద్ద శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు, మోక్షం కోసం తపస్సు చేస్తున్న మధు--కైటభ రాక్షసులు కొలువై ఉన్న దృశ్యం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తుతోంది.

## దర్శనం -- నిత్య సేవలు

ప్రతిరోజూ ఉదయం 5 గంటలకు సుప్రభాతంతో స్వామివారి సేవలు ప్రారంభమవుతాయి. ఉదయం 5.30 గంటలకు విశ్వరూప దర్శనం, 6.30 గంటలకు తోమాల సేవ, 7.30 గంటలకు అర్చన, 8 గంటలకు అర్చనానంతర దర్శనం నిర్వహిస్తారు. రాత్రి 8.30 గంటలకు ఏకాంత సేవతో నిత్య కార్యక్రమాలు ముగుస్తాయి. ఈ సేవల్లో పాల్గొనే భక్తులు అపార ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారు.

# నిరుపేదలకు ఆపదలో ఆపద్బాంధవుడు

**- గిద్దలూరు బి.వి.ప్రతాపరెడ్డి..**



**కొలిమిగుండ్ల మే 21** నంద్యాల జిల్లా సంజామల మండలంలోని గిద్దలూరు గ్రామంలో ఇవాళ శివశంకర్ అనే యువకుడు పలు అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి సీనియర్ నాయకుడు బివి. ప్రతాప్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని శివశంకర్ మృతదేహాన్ని పరిశీలించి నివాళు లర్పించారు. బి వి ప్రతాప్ రెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం దినకర్మల కోసం మృతుని తల్లి నారమ్మకు వివి ప్రతాపరెడ్డి 5000 రూపాయలను ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బివి ప్రతాప్ రెడ్డి అంటే నిరుపేదలకు ఆపదలో ఆపద్బాంధవుడు అని గ్రామ ప్రజలు చెబుతుంటారు. గ్రామంలో ఎవరైనా నిరుపేదలు చనిపోతే తక్షణ సహాయం కింద వారికి 5000 రూపాయలను బివి ప్రతాపరెడ్డి అందజేస్తూ ఉంటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ గ్రామంలో ఉన్న ప్రజలను ఆదుకోవడమే తన లక్ష్యమని బివి ప్రతాప్ రెడ్డి అన్నారు.

# రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలి

**- ఏవో సురేష్ బాబు**

**- రాంపల్లి క్రాస్ రోడ్ నందు ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేసిన ఏవో**



**తుగ్గలి**మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రాంపల్లి క్రాస్ రోడ్ నందు గల రంగస్వామి ఫర్టిలైజర్స్ షాపును తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఏవో షాపుల్లో నిల్వ ఉన్న యూరియా, డీఏపీ,కాంప్లెక్స్ ఎరువుల స్టాక్ను,స్టాక్ రిజిస్టర్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.రైతులకు ఎంఆర్పీ ధరకే మందులను అమ్మాలని,గడువు తీరిన ఎరువులు,పురుగు మందులు విక్రయించవద్దని ఆదేశించారు.ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్టాక్ వివరాలు బోర్డుపై ప్రతిరోజూ రాయాలని,నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని షాపు యజమానులను హెచ్చరించారు.నకిలీ ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు.మండలంలో ఫర్టిలైజర్ కొరత ఎక్కడా లేదని,ఈ నెలాఖరులో వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తామని ఆయన తెలియజేశారు. రైతులందరూ కౌలు కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు రైతులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు,ఫర్టిలైజర్ షాపు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# మిగులు సోలార్ విద్యుత్కు విలువ తెచ్చిన సింగరేణి

**- మిగులు సోలార్ విద్యుత్ను నిల్వ చేస్తున్న బీఈఎస్ఎస్**

**- రాష్ట్ర ప్రభుత్వ ఆదేశంతో రాష్ట్రంలోనే తొలి అతిపెద్ద ప్రాజెక్టు సింగరేణిలో ఏర్పాటు**

**సింగరేణి భవన్,** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు రాష్ట్రంలోనే తొలిసారిగా సింగరేణిలో ఏర్పాటు చేసిన బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ సత్ఫలితాన్ని ఇస్తోంది. పగటిపూట ఉత్పత్తి జరిగే సోలార్ విద్యుత్తులో వినియోగించబడని విద్యుత్తును ఉచితంగా గ్రిడ్ కు సరఫరా చేయకుండా, బ్యాటరీలో నిలువ చేసుకొని, అవసరమైనప్పుడు వాడుకునే అవకాశం కలిగించే ఈ వ్యవస్థ సింగరేణికి ఆర్థిక లబ్ధి చేకూర్చుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు ఆదేశాల మేరకు నాలుగు నెలల క్రితం మందమర్రి ఏరియాలోని 28 మెగావాట్ల సింగరేణి సోలార్ ప్లాంట్కు అనుబంధంగా 1 మెగావాట్ బ్యాటరీ ఎనర్జీ సిస్టమ్ నెలకొల్పడం జరిగింది.

ఇందు కోసం రూ.2.5 కోట్లను యాజమాన్యం వెచ్చించింది.బీఈఎస్ఎస్ ఉపయోగం ఏమిటి?

రాష్ట్ర ప్రభుత్వం సౌర విద్యుత్తుకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకొని సింగరేణితో సహా పలు రాష్ట్ర సంస్థలు సోలార్ విద్యుత్ ను ఉత్పత్తి చేస్తున్నాయి. సింగరేణి సంస్థ ఇప్పటికే 8 చోట్ల 245.5 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. వీటిలో 147 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను ఓపెన్ యాక్సెస్ ప్లాంట్లుగా, మిగిలిన 98.50 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను ఇన్ హౌజ్ ప్లాంట్లుగా గుర్తించి తెలంగాణ విద్యుత్తు గ్రిడ్డులకు అనుసంధానం చేసింది.

ఈ ఇన్ హౌజ్ ప్లాంట్ల విద్యుత్తును కూడా తెలంగాణ విద్యుత్ శాఖ గ్రిడ్లకు అనుసంధానం చేసినప్పటికీ విద్యుత్ ఒప్పందం ప్రకారం ఇక్కడ స్థానిక అవసరాలకు వాడగా మిగిలిన విద్యుత్తుకు మాత్రం తెలంగాణ డిస్కము ఎటువంటి చెల్లింపులు జరపదు. మిగులు విద్యుత్తును కేవలం ఉచితంగానే గ్రిడ్డుకు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ విధంగా ఇన్ హౌస్ ప్లాంట్ల నుండిరోజుకు వేలాది యూనిట్ల మిగులు విద్యుత్తును ఎటువంటి ఆర్థిక ప్రయోజనం లేకుండా గ్రిడ్ కు సరఫరా చేయడం జరుగుతోంది. అయితే ఈ మిగులు విద్యుత్తును కూడా సొమ్ము చేసుకోవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు సింగరేణి సంస్థ రాష్ట్రంలోనే తొలిసారిగా ఒక మెగావాట్ సామర్థ్యం గల బీఈఎస్ఎస్ ను మందమర్రి ప్లాంట్ లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసింది. మందమర్రి లో గల 28 మెగావాట్ల సోలార్ ప్లాంట్ సమర్థంగా పనిచేస్తూ మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియా లలోని గనులకు, కాలనీలకు అవసరమైన విద్యుత్తును అందిస్తోంది. అయితే స్థానిక విద్యుత్తు అవసరాలకు సరిపోగా ఇంకా కొంత విద్యుత్తు మిగిలిపోతుంది. ఈ నేపథ్యంలో మందమర్రి ప్లాంటు లో జనవరి నెలలో బ్యాటరీ ఎనర్జీ స్టోరీ సిస్టం ను సింగరేణి ఏర్పాటు చేసింది. అప్పటి నుండి ఇప్పటి వరకు బిఈఎస్ఎస్ యూనిట్ స్థానిక అవసరాలకు వినియోగించగా ఇంకా మిగిలిన 3,35,485 యూనిట్ల విద్యుత్తును నిల్వ చేసుకొని అవసరమైన సందర్భంలో వినియోగించుకుంది. తద్వారా సింగరేణి సంస్థకు రూ. 25,66,460 ఆర్థిక లబ్ధి చేకూరింది. ఒక మెగావాటు సామర్థ్యం గల బీఈఎస్ఎస్ యూనిట్ ఇంత పెద్ద మొత్తంలో విద్యుత్తును ఆదా చేయడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఇక్కడ ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన బీఈఎస్ఎస్ విజయవంతం అవడంపై సింగరేణి యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మరిన్ని ప్రాజెక్టులను చేపట్టేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు యాజమాన్యం ప్రకటించింది

# బాలమేధావి మౌర్య కు సత్కారం!

**నల్లజర్ల (తూర్పుగోదావరి):** రెండున్నర ఏళ్ల చిరు ప్రాయంలోనే ప్రపంచ రికార్డులు సాధిస్తున్న మౌర్య కు గురువారం చిరుసత్కారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ వైద్యఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు జీ.వీ.వీ.ప్రసాద్, సమాజసేవకులు మల్లిపూడి రాజారావు ఆధ్వర్యంలో ఈ సత్కారం జరిగింది. అసాధారణ జ్ఞాపకశక్తిని ప్రదర్శించిన చిన్నోడు మౌర్య కు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ స్థానం సాధించిన విషయం తెలిసిందే.

ఇటువంటి ప్రతిభావంతుల్ని ప్రోత్సహించడం కనీస బాధ్యతగా భావించి మౌర్య ఇంటికి ఆవపాడు గ్రామం వెళ్లి తామిా కార్యక్రమం చేసినట్టు ప్రసాద్, రాజారావు వెల్లడించారు. మౌర్య లాంటి పిల్లలు మన సమాజానికి స్ఫూర్తినిచ్చేలా తీర్చిదిద్దిన మౌర్య తల్లి రాణీని అభినందిస్తూ, నేటి తరం తల్లితండ్రులకు ఆదర్శంగా రాణీ నిలుస్తారని సత్కరిస్తూ కొనియాడారు.

ప్రజాప్రశ్న

హైదరాబాద్ శుక్రవారం 22, మే 2026

# అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అర్బన్ మండల స్థాయికి విస్తరణ

**– దాతల సహకారంతో కొనసాగుతున్న ట్రస్ట్ సేవా కార్యక్రమాలు**

**– ట్రస్ట్ నిర్వాహకులు : తోట లహరి**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న "అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ" తమ సేవలను అర్బన్ మండల స్థాయి వరకు విస్తరించింది. ఇప్పటి వరకు పట్టణ పరిధిలో మాత్రమే కొనసాగిన అంత్యక్రియల అనంతరం కుటుంబ సభ్యులకు ఉచిత భోజన పంపిణీ కార్యక్రమాన్ని ఇకపై వేములవాడ అర్బన్ మండల పరిధిలో కూడా అమలు చేయనున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు తోట లహరి తెలిపారు.వేములవాడ పట్టణం లేదా అర్బన్ మండల పరిధిలో ఎవరైనా మరణించిన సందర్భంలో కుటుంబ సభ్యులు లేదా స్థానికులు 8919376459, 9032933350 నెంబర్లకు సమాచారం అందిస్తే సకాలంలో ఉచిత భోజనం అందజేస్తామని పేర్కొన్నారు.అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిరోజు అన్నదానం, ప్రభుత్వ పాఠశాలల పేద విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నుల పంపిణీ, పేదలకు వైద్య సహాయం వంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ట్రస్ట్ నిర్వాహకులు చేస్తున్న సేవలను ప్రజలు అభినందిస్తున్నారు.ట్రస్ట్ నిర్వాహకురాలు తోట లహరి మాట్లాడుతూ, దాతల సహకారంతో గత కొన్ని సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలనుకునే వారు ట్రస్ట్‌ను సంప్రదించాలని కోరారు.

# బోనాల జాతరకు మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత





గజ్వేల (ప్రశ్న న్యూస్) జగదేవపూర్ మేజర్ గ్రామంలో ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ పెద్దమ్మ తల్లి, మహంకాళమ్మ తల్లి, కనకదుర్గమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం మరియు బోనాల జాతరకు హాజరుకావాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈ సందర్భంగా జగదేవపూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇమ్మడి శివలక్ష్మి--జహంగీర్ మర్యాదపూర్వకంగా ఆహ్వానిస్తూ జాతర కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అమర రాము, వార్డు సభ్యులు కొత్త మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పైప్‌లైన్ పనుల కోసం తవ్విన రోడ్లను వెంటనే మరమ్మతు చేయాలి

**సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి డిమాండ్**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్)గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఎన్టీఆర్ చౌరస్తా సమీపంలోని రాజీవ్ పార్క్ రోడ్, అయ్యప్ప నగర్ కాలనీలో ప్రధాన రహదారి వెంబడి పైప్‌లైన్ మరమ్మతుల కోసం డ్రిల్లింగ్ మెషిన్లు, జేసీబీల సహాయంతో రోడ్డును తవ్వి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి ఆందోళన వ్యక్తం చేశారు.పైపులు వేసిన అనంతరం రోడ్డు పునర్నిర్మాణ పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో రహదారి కాలువల మాదిరిగా మారిందని, దీంతో రాజిరెడ్డిపల్లి వెళ్లే ప్రయాణికులు, కాలనీవాసులు ప్రతిరోజూ ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు.సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్‌లో భారత రత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి, సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్ష రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ.. దేశ యువతకు ఆదర్శప్రాయుడైన రాజీవ్ గాంధీ భారతదేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసి, ఆధునిక భారత నిర్మాణానికి నాంది పలికారన్నారు. వారి ఆశయాల దారిలో నడుస్తూ వారికి ఘన నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు.అలాగే దేశ సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, నాయిని సత్యలక్ష్మి యాదగిరి, నక్క రాములు గౌడ్, గుంటూకు శ్రీనివాస్, చెన్నారెడ్డి, మొనగారి రాజు, ఉడెం శ్రీనివాస్ రెడ్డి, బుడిగే యాదగిరి, సమీర్, గాజుల శ్రీనివాస్, అంజి యాదవ్, జంగం రమేష్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, సుఖేందర్ రెడ్డి, షరీఫ్, అనాజిపూర్ రమేష్ గౌడ్, బాల్ రెడ్డి, షకీల్ పాషా, సురేష్, చేప్యాల శ్రీను, బాలు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ జీవితం దేశానికి అంకితం

**కప్పర భాను ప్రకాశ్ రావు**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్)గజ్వేల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధికి చేసిన సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో మాట్లాడిన కప్పర భాను ప్రకాశ్ రావు మాట్లాడుతూ, భారతదేశాన్ని ఆధునిక ప్రపంచం వైపు నడిపించిన దూరదృష్టి గల నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. టెలికాం, కంప్యూటర్ రంగాల్లో విప్లవాత్మక మార్పులకు ఆయనే పునాది వేశారని తెలిపారు. నేటి ఐటీ భారత్‌కు రాజీవ్ గాంధీ చూపిన మార్గమే బలమైన ఆధారమని పేర్కొన్నారు.1985లో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తీసుకువచ్చి రాజకీయ వ్యవస్థలో పారదర్శకతకు కృషి చేశారని, అలాగే 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పిస్తూ యువతను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేసిన మహానేత అని అన్నారు.1986 జాతీయ విద్యా విధానం ద్వారా గ్రామీణ విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు నవోదయ విద్యాలయాలను స్థాపించారని గుర్తు చేశారు. గ్రామ స్వరాజ్యం, స్థానిక సంస్థల బలోపేతం, మహిళా సాధికారత వంటి అంశాల్లో రాజీవ్ గాంధీ ఆలోచనలు దేశ భవిష్యత్తుకు మార్గదర్శకమయ్యాయని తెలిపారు.దేశ సమగ్రత కోసం ప్రాణత్యాగం చేసిన రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కాంగ్రెస్ శ్రేణులు కట్టుబడి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాచారం దేవస్థాన డైరెక్టర్ శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బునారి రాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జయల వేణుగోపాల్, యువజన కాంగ్రెస్ నాయకులు నవీన్ గౌడ్, మంగలి యాదగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రీయ వ్యవసాయంతో అధిక లాభాలు : ఏడిఏ అనిల్ కుమార్




గజ్వేల్ (ప్రశ్న న్యూస్)గణేష్‌పల్లిలో జీలుగ జనుము విత్తనాల అమ్మకాలు ప్రారంభంసిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం గణేష్‌పల్లి ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో జీలుగ జనుము విత్తనాల అమ్మకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఏడిఏ అనిల్ కుమార్ పాల్గొని రైతులకు సేంద్రీయ వ్యవసాయం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని పెంచుకోవడానికి పచ్చిరొట్ట ఎరువుల సాగు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ముఖ్యంగా జీలుగ జనుము వంటి పంటలను ప్రధాన పంటకు ముందుగా సాగు చేసి, పూత దశలో భూమిలో కలియదున్నడం వల్ల భూమికి అవసరమైన నత్రజని, సేంద్రియ కర్బనం సమృద్ధిగా లభిస్తాయని పేర్కొన్నారు. దీని వల్ల భూమి ఆరోగ్యం మెరుగుపడి, తదుపరి వేసే ప్రధాన పంట దిగుబడి గణనీయంగా పెరుగుతుందని వివరించారు.ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఈ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్ వివరాలతో ఆగ్రోస్ కేంద్రంలో విత్తనాలను కొనుగోలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయమోహన్, మాజీ జెడ్పీటీసీ ఏంబరి రామచంద్రం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కనకయ్య గౌడ్, వ్యవసాయ అధికారులు, సర్పంచులు రామరాజు, కొండల్ రెడ్డి, ర్యాంకం యాదగిరి, నాయకులు రాములు గౌడ్, గోవర్ధన్ రెడ్డి, రఘుపతి, బాలనర్సయ్య, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణ వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలి

**ఆర్ సెటీ శిక్షణ కోర్సులతో యువతకు మేలు: కలెక్టర్ గరిమ అగ్రవాల్**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) ఉచిత శిక్షణను యువతీ యువకులు వినియోగించు కోవాలని, ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ, బ్యాంకుల సహకారంతో ఆర్ సెటీ (రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్) ఆద్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నెహ్రూ నగర్ శిక్షణా కేంద్రంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. శిక్షణ ఇచ్చే, ట్రైనింగ్, వసతి గదులను ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా మగ్గం వర్క్ కింద శిక్షణ పొంది పలువురు అభ్యర్థులు సిద్ధం చేసిన వస్త్రాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజూ ఎన్ని గంటలు శిక్షణ పొందుతున్నారో ఆరా తీశారు. మగ్గం వర్క్ తర్ఫీదు పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. గతంలో ఉమ్మడి జిల్లా కేంద్రంలోనే ఆర్ సెటీ కేంద్రాలు ఉండేవని, ఇప్పుడు మన జిల్లాలో కూడా అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. జిల్లాలోని యువతీ యువకులు ఇక్కడ అందించే ఉచిత వసతి, భోజనం, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. శిక్షణలో భాగంగా అందించే ప్రతి మెలకువను ఎంతో శ్రద్ధ, ఆసక్తితో నేర్చుకొని.. స్వయం ఉపాధిలో ఆ అంశాలు వినియోగించాలని సూచించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ ఆర్థిక స్వాతంత్రం సాధించాలని ఆకాంక్షించారు. మరో పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపు నిచ్చారు. మార్కెట్, పరిశ్రమల అవసరాలు, అభ్యర్థుల డిమాండ్ కు అనుగుణంగా నూతన కోర్సులు ప్రారంభించాలని, ఏడాది అంతా శిక్షణ అందించాలని నిర్వాహకులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, యూబీఐ డీజీఎం నటరాజ్, ఏజీఎం శ్రీనివాసరావు, ఎల్ డీ ఎం మల్లికార్జున రావు, శిక్షణ కేంద్రం బాధ్యులు, బ్యాంక్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మాకు న్యాయం జరిగే వరకు పోరాటం

**గాంధీనగర్ నల్ల పోచమ్మ వాడ ఇల్లు స్థలాలు కోల్పోయిన బాధితులు**



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) యాదగిరిగుట్ట అభివృద్ధిలో భాగంగా పట్టణంలోని గాంధీ నగర్ నల్ల పోచమ్మ వాడలో నివాస గృహాలు స్థలాలు, భూములు కోల్పోయిన వారికి న్యాయం జరిగే వరకూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని ఇండ్లు స్థలాలు భూములు కోల్పోయిన బాధితుల జేఏసీ సభ్యులు తెలిపారు గురువారం గాంధీనగర్ నల్ల పోచమ్మ వాడలో బాధితులు మీడియాతో మాట్లాడారు. యాదగిరిగుట్ట కొండ చుట్టూ రింగ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా గాంధీనగర్ గోశాల గేటు నుండి మసీదు వరకు రోడ్డుకు ఎడమవైపున ఉన్న నివాస గృహాలు వ్యాపార సముదాయాలు మడిగలు గత ప్రభుత్వం తమ నుండి తీసుకుందని వారు తెలిపారు ఇందుకు బదులుగా 329 సర్వే నెంబర్లు నెమలి వెంచర్ లో ప్లాట్లు కేటాయించినప్పటికీ కోర్టు కేసుల వల్ల వాటిని తమకు స్వాధీనం చేయలేదని తెలిపారు యాదగిరిగుట్ట అభివృద్ధిలో భాగం అయ్యేందుకు తాము ప్రభుత్వానికి సహకరించి ఇండ్లు ఇంటి స్థలాలు మడిగలు దుకాణాలు ఇచ్చినప్పటికీ తమకు ఇంతవరకు న్యాయం జరగలేదని అన్నారు ఇంటికి ఇల్లు దుకాణానికి దుకాణం కేటాయిస్తామని గత ప్రభుత్వం చెప్పినప్పటికీ అమలు చేయలేదని ప్రస్తుతం తమ పరిస్థితి రోడ్డున పడి దీనవస్థలో ఉందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యలు తమకు న్యాయం చేయాలని అన్నారు . తమకు నష్టపరిహారం పూర్తిస్థాయిలో అందజేయడంతో పాటు ఇంటికి ఇల్లు దుకాణానికి దుకాణం కేటాయించాలని కోరుతున్నామని అన్నారు ఇప్పటికే ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులకు అనేక మార్లు వినతి పత్రాలు అందజేసినా తగిన స్పందన లేదని అన్నారు. తమకు న్యాయం జరిగే వరకూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బాధితుల జేఏసీ సభ్యులు రాచకొండ జానకిరామ్, చిత్తార్ల కృష్ణ, శివకోటి వీరస్వామి , కొంగరి లావణ్య , కాదునూరి కౌసల్య మోతే మదర్, పేరపు సిద్ధులు, పబ్బని లక్ష్మి , శివకోటి భాస్కర్, బి లలిత, తోట ఆంజనేయులు, మోతే వెంకటయ్య, గుజ్జ రాజేశ్వర్ , నాగభూషణం, రాచకొండ ప్రేమ సుల్తానా మిట్ట చంద్రమౌళి , నవీన్ , ములుగు పోచమ్మ, పోరుగంటి దశరథ, ఎర్ర పోచయ్య, ఆకారపు ఎల్లయ్య, రామాంజనేయులు మోతే ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలు త్వరితగతిన పూర్తి చేయాలి : పంజాల అశోక్ గౌడ్

**ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేసిన బీజేపీ నాయకులు**



గజ్వెల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్‌లో బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు, ఎంపీ రఘునందన్ రావు ఆదేశాల మేరకు స్థానిక ఎమ్మార్వోకు బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా బీజేపీ గజ్వేల్ మండల అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ మాట్లాడుతూ వడ్ల కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని, తరుగు--తేమ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలు కొనుగోలు కేంద్రాల్లో కల్పించాలని కోరారు.కొన్ని గ్రామాల్లో లారీలు అందుబాటులో లేకపోవడంతో రైతులు తమ సొంత ట్రాక్టర్లపై వడ్లను తరలించాల్సి వస్తోందని, ఇది రైతులకు అదనపు భారం అవుతోందని పేర్కొన్నారు. అందువల్ల ప్రభుత్వం అధిక సంఖ్యలో లారీలను సమకూర్చాలని డిమాండ్ చేశారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వంజరి రాజు, మండల ప్రధాన కార్యదర్శి ఇప్ప స్వామి, మండల ఉపాధ్యక్షులు బినమైన ప్రభాకర్, శాతం స్వామి, మండల నాయకులు వెంకటేష్ గౌడ్, గణపతి, శివ ప్రసాద్, అనిల్, నవీన్, నరసింహారెడ్డి, నరేష్ గౌడ్, కరుణాకర్, ప్రభాకర్, నరేష్, మల్లేశం, రాజు, స్వామి, మహేందర్, వెంకటేష్, నాని, సాయి ప్రసాద్, నర్సింలు, లక్ష్మీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నక్కపల్లిలో సైనింగ్ స్టార్స్ అభినందన కార్యక్రమం

**– హోం మంత్రి అనిత**



**నక్కపల్లి,** :-అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో హోంమంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో సైనింగ్ స్టార్స్ అభినందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు.పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. మొత్తం 103 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున సొంత నిధుల నుంచి నగదు బహుమతులు అందజేశారు. నగదు బహుమతితో పాటు సాలువా, మెమొంటో, ప్రశంసాపత్రాలను అందించి సత్కరించారు. అనకాపల్లి జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులను కూడా ఘనంగా సన్మానించి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని మంత్రి అందజేశారు. విద్యార్థులకు మంచి ఫలితాలు తీసుకురావడంలో కృషి చేసిన ఉపాధ్యాయులను కూడా మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్ కలిసి సత్కరించారు. గత సంవత్సరం కూడా పాయకరావుపేట నియోజకవర్గంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సొంత నిధులతో ప్రోత్సాహకాలు అందించి సన్మానించినట్లు ఉపాధ్యాయులు గుర్తు చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో ఏపీ విద్యా వ్యవస్థ అంతర్జాతీయ ప్రమాణాల దిశగా ముందుకు సాగుతోందన్నారు. వంద రోజుల ప్రణాళికలతో ఈసారి పదో తరగతి ఫలితాలు గతంలో ఎన్నడూ లేనంతగా వచ్చాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల ఫోటోలను పత్రికల్లో ప్రకటనల రూపంలో ప్రచురించడం కూటమి ప్రభుత్వ ప్రత్యేకత అని చెప్పారు. గత ప్రభుత్వంలో విద్యార్థులకు నాసిరకం బ్యాగులు ఇచ్చారని విమర్శించారు. ఈసారి పదో తరగతి ఫలితాల్లో బాలికలే అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని, ఆడపిల్లలు బంగారు తల్లులని కొనియాడారు. పిల్లల పెంపకంలో ఆడ, మగ తేడా చూపకూడదని, వారి ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి పెట్టాలని సూచించారు. చిన్న చిన్న తప్పిదాల వల్ల కొందరు విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలని, ప్రతి విద్యార్థికి ఒక స్పష్టమైన లక్ష్యం అవసరమని తెలిపారు. యువత కూడా రాజకీయాల్లోకి రావాలని హోంమంత్రి పిలుపునిచ్చారు.

# ఎర్ర శోభ జ్ఞాపకాల్లో కుటుంబ సభ్యులు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామానికి చెందిన ఎర్ర శోభ విద్యుదాఘాతంతో మృతి చెంది ఏడాది పూర్తైన సందర్భంగా గురువారం ఆమె కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు భావోద్వేగంతో స్మరించుకున్నారు .శోభ లేకపోవడం కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఆమె జ్ఞాపకాలు ప్రతి రోజూ వెంటాడుతున్నాయని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె ప్రేమ, ఆదరణ, ఆప్యాయతలను గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు శోభ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ నివాళులర్పించారు.

# పెళ్లి వేడుకను హరిత సందేశంగా మార్చిన వెంకటేష్-అనిత దంపతులు

**- మొక్క నాటి ఆదర్శంగా నిలిచిన దంపతులు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, తడగొండ గ్రామంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమం సందడి చేసింది. తమ వివాహాన్ని పురస్కరించుకొని రేండ్ల వెంకటేష్--అనిత దంపతులు తమ ఇంటి ఆవరణలో మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటిచెప్పారు. మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరితసేనలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకటేష్ - అనిత మాట్లాడుతూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. భావితరాల భవిష్యత్తు కోసం గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో అవసరమన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ చిందం రమేష్, మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు సింగరి రమేష్, వార్డు సభ్యుడు బుర్ర రాజు, చేపూరి మహిపాల్, పొన్నం తిరుపతి, మూదం కమలాకర్, చిందం శేషి, సింగరి నరేష్, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సభ్యుడు కమల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**- తాలూ - తరుగు పేరుతో రైతుల దోపిడీని ఆపాలి**

**- భాజపా మండలాధ్యక్షులు : ఎడపల్లి పరశురాం**

**- ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని తహసీల్దార్ కు బీజేపీ వినతి**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు పరశు రామ్ ఎడపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు వ్యవస్థ పూర్తిగా గాడితప్పిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కల్లాల్లో పోసి నెల రోజులుగా ఎదురుచూస్తున్నప్పటికీ కొనుగోళ్లు పూర్తి కాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రైస్ మిల్లర్లు,దళారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు.“తాలు--తరుగు” పేరుతో ప్రతి క్వింటాకు 6 నుంచి 8 కిలోల వరకు అక్రమ కోతలు విధిస్తూ రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నారని మండిపడ్డారు.చొప్పదండి ఎమ్మెల్యే ఎక్కడా కోతలు లేవని చెబుతూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని, రైతుల బాధలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బోయినిపల్లి మండలంలోని ప్రతి రైతు వద్ద నుంచి ఎలాంటి తరుగు కోతలు లేకుండా ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, మాజీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మెరుపుల గంగాధర్ గౌడ్, రాజేంద్రప్రసాద్, యువమోర్చా మండల అధ్యక్షుడు మిరియాల శరత్ చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు కొంకటి హరీష్, చిలుముల రమేష్, బూత్ అధ్యక్షులు మధుకర్, అనిల్, రజనీకాంత్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వస్తున్న ముఖ్యమంత్రి



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) ఈనెల 23న యాదగిరిగుట్ట టెంపుల్ సిటీ పై వేద పాఠశాలకు, ఆలయ కొండపైన నిత్యాకళ్యాణ మండపం, ప్రధానాలయ వాయువ్య దిశలో మెట్లమార్గం, కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి పై కప్పు,దీక్షపరుల భవనం కు శంకుస్థాపన జరగనుందన్నారు. కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి పర్యవేక్షణ లో సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు.100 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి తో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేస్తారన్నారు. 23న జరిగే శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడానికి 22వ తేదీన యాదగిరిగుట్ట కి కంచికామ కోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ రానున్నారన్నారు.22న లక్ష్మీ నరసింహ స్వామి ని కంచికామ కోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి దర్శించుకుంటారన్నారు. అనంతరం భజనం కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.కంచి పీఠాధిపతి కి మహదాశీర్వచనం అనంతరం అనుగ్రహం బాషణం చేస్తారన్నారు. కంచికామ కోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి నిర్వహించే భజన కార్యక్రమానికి పెద్ద ఎత్తున్న భక్తులు హాజరుకావాలని కోరారు. శంకుస్థాపన కార్యక్రమంలో రోజు ఆలయానికి విచ్చేసే భక్తులు ఆలయ అధికారులు, పోలీస్ అధికారులకు సహకరించాలని తెలిపారు.

# వరి కొయ్యలను కాల్చొద్దు. ఏవో శ్వేత కుమారి

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) నిప్పుపెడితే భూమి సారాన్ని కోల్పోతుంది దిగుబడీ తగ్గుతుందిప్రకృతి సమతుల్యత దెబ్బతింటుందిపొలాన్ని కలియ దున్నితేనే పంటకు మేలు. గతంలో వరి పంటను కొడవళ్లతో మొదళ్ల దాకా కోసేవారు. అంతేకాకుండా పశువులు ఎక్కువగా ఉండటంతో గడ్డిని కుప్పలుకుప్పలుగా పశుగ్రాసం కోసం నిల్వ చేసేవారు. అయితే ప్రస్తుతం సాగు విధానంలో అనే క మార్పులొచ్చాయి. పశువుల సంఖ్య తగ్గిపోవడంతో యంత్రాలను విరివిగా వినియోగిస్తున్నారు. మిషన్‌తో హార్వెస్టింగ్ చేసే సమయంలో పైకి కోయడం ద్వారా కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. అవసరమున్న రైతులు కొంత గడ్డిని కోసి తీసుకొచ్చుకుని మిగిలిన దానిని అక్కడే వదిలేస్తున్నారు. దీంతో దున్నే సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని రైతులు వరికొయ్యలతోపాటు గడ్డిని కూడాకాలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. దీనివల్ల అధిక నష్టాలు వచ్చే అవకాశముందని, ఎట్టి పరిస్థితుల్లోనూ వరికొయ్యలను తగలపెటోడు.

**- ఎనిమిది రోజుల ముందుగా దున్నాలి**

రైతులు చాలామంది వరినాటు వేసే సమయంలో మొదటి దఫా దున్నుడుకు, రెండో దఫా దున్నుడుకు మధ్య నాలుగు నుంచి ఐదురోజుల సమయం మాత్రమే తీసుకుంటారు. దీనివల్ల వరికొయ్యలు(కొయ్యకాలు), గడ్డి త్వరగా కుళ్లిపోవు. ఇలాంటి సమయంలో పశువులను అందులో వదిలితే అటూ తిరగడం, పొలం లో పేడ, మూత్ర విసర్జన చేయడం ద్వారా త్వరగా కుళ్లిపోయి భూసారంతోపాటు పంట దిగుబడి 5 శాతం పెరుగుతుంది. లేదంటే అందులోనే కలియదున్ని కనీసం ఎనిమిది రోజుల సమ యం తీసుకుని రెండోసారి దున్నాలి. వీలైతే మొదటి దఫాలో ఒక్కసారి రోటోవేటర్‌తో దున్నితే గడ్డి, కొయ్యకాలు చిన్న, చిన్న ముక్కలుగా విడిపోయి మరోసారి దున్నినప్పుడు ఎలాంటి సమస్యా ఉండదు. దున్నే ముందు ఎకరానికి క్వింటాలు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే వరికొయ్యలు, గడ్డి త్వరగా కుళ్లిపోతా యి. జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలు వేసి ఏపుగా పెరిగిన తర్వాత కలియదున్నితే భూమి సారవంతంగా మారుతుంది.

**- సారాన్ని కోల్పోతుంది**

వరికొయ్యలను (కొయ్యకాలు) కాల్చితే నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదు . కాల్చడం ద్వారా విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, ఫాస్ఫరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గుతుంది. దిగుబడీ పోతుంది. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పం టలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. పొలాల్లో తిరిగే పాములు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక జీవరాసులు చనిపోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. పొలాల గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు కాలిపోవడంతో పర్యావరణానికి హాని కలుగుతుంది. ఆలస్యంగా కోతకు వచ్చే పంటలు, కల్లాల దగ్గరే ఉన్న ధాన్యం కాలిపోయి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

**- పొలాన్ని కలియ దున్నితే కలిగే ప్రయోజనాలు**

వరి కొయ్యలను నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బనశాతం పెరిగి దిగుబడులు 5నుంచి 10శాతం వరకు పెరిగే అవకాశముంది.దుక్కి దున్నే సమయంలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి.

ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది.కలియ దున్నితే ఎకరాకు దాదాపుగా టన్ను వరకు ఎరువు తయారవుతుంది.మొక్కలకు 2శాతం నత్రజని (యూరియా) 4శాతం ఫాస్ఫరస్ అదనంగా అందిస్తుంది.

జింక్, మాంగనీస్, ఇనుము, క్యాల్షియం లాంటివి పంటకు మేలు చేస్తాయి.నేలలో కరుగని మూలకాలనూ పంటకు అనుకూలంగా మార్చుతుంది.

**నీటినిల్వ సామర్థ్యం పెరుగుతుంది.**

వరికొయ్యలకు (కొయ్యకాలు) నిప్పు పెట్టడం వల్ల గాలి, నేల కలుషితమవుతుంది. పంటలకు మేలుచేసే మిత్ర పురుగులు మరణిస్తాయి. వరికొయ్యలను పొలంలో కలియ దున్నితే సేంద్రియ ఎరువుగా మారుతుంది.

ఎకరానికి దాదాపు టన్ను ఎరువు తయారవుతుంది. దున్నే ముందు తప్పనిసరిగా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే వరికొయ్యలు, గడ్డి మొక్కలు తొందరగా కుళ్లిపోతాయి. మురిగిన కొయ్యలు ఎరువుగా మారడటంతో దిగుబడి పెరుగుతుంది. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించొచ్చు.

# గ్రామీణాభివృద్ధికి రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

**- రాజీవ్ గాంధీ స్ఫూర్తితో ప్రజా సేవను కొనసాగిద్దాం..!**

**- రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి**

**- కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు : కొమ్మనబోయిన సువీన్ యాదవ్**

**- తడగొండలో రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు**

**- కూలీలకు మజ్జిగ,పండ్లు పంపిణీ**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, తడగొండ గ్రామంలో మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ 35వ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్మనబోయిన సువీన్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సువీన్ యాదవ్ మాట్లాడుతూ.. దేశాన్ని సాంకేతిక రంగంలో ముందుకు నడిపించిన దూరదృష్టి గల నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. గ్రామీణ పాలనలో ప్రజలకు అధికారం చేరువయ్యేలా పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత ఆయనదేనన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాల సాధన కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం ఉపాధి హామీ పనుల్లో



మండుటెండలో పనిచేస్తున్న కూలీల వద్దకు వెళ్లిన కాంగ్రెస్ నాయకులు వారికి మజ్జిగ, పండ్లు పంపిణీ చేశారు. ఎండల తీవ్రతలో కూలీలకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని సువీన్ యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, వైస్ ఛైర్మన్ వినోద్ రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, సర్పంచులు నల్ల మోహన్, జంగం అంజయ్య,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బొంగోని వెంకటేష్, అద్దంకి రమేష్,గుడి శేఖర్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు గుడి శ్రీనివాస్ రెడ్డి, ఎండి హుస్సేన్, మండల శ్రీను, ముచ్చ శేఖర్ రెడ్డి, బాబు, అనుపట్ల తిరుపతి రెడ్డి, జాగిరి శోభన్, జంగ సత్యం, నాగుల వంశీ, చేపూరి వెంకటేష్, దయ్యాల రాజశేఖర్, కొలుపుల ప్రవీణ్, మందల వరుణ్, మందల వంశీ, జాగిరి వెంకటేష్, కేశవ రెడ్డి, మండల నరేష్, దూస రాజశేఖర్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అఫ్ఘానికి అన్నం పెడదాం

**అంతర్జాతీయ మీడియాలో ఒక దృశ్యం కదలాడింది.**






సింహాచలం లక్ష్మణస్వామి, కవి-రచయిత

ఆఫ్ఘాన్ పల్లెలో ఒక తండ్రి - బక్కచిక్కిన చేతులతో, విరిగిన గుండెతో - తన చిన్న ఆడపిల్లను ఒక అపరిచితుని చేతిలో పెడుతున్నాడు. ఆ పిల్ల అప్పుడు తండ్రి మొహం వదలకుండా దీనంగా చూస్తూ ఏడుస్తోంది. ఆ తండ్రికి కన్నీళ్ళు కూడా రావడం లేదు. ఆకలి కన్నీళ్ళనే మింగేస్తుంది కదా. ఇది కల్పన కాదు - జాతీయ, అంతర్జాతీయ మీడియా నేరుగా చూపించిన నిజం.

ఆ దృశ్యం చూసిన తర్వాత నా కలం ఆగలేదు. నా హృదయం ఆగలేదు.కన్నీటికి మతం లేదు. కులం లేదు. ప్రాంతం లేదు. సరిహద్దు లేదు. ఆకలి బాధకు జాతి లేదు, భాష లేదు. ఈ భూమండలం మీద నివసించే ప్రతి ప్రాణీ సాటి మనిషే. ఆ మనిషి పొట్ట మండుతుంటే మన హృదయం చల్లగా ఉండటం మానవత్వానికే అవమానం.

**కళ్ళకు కట్టే గణాంకాల కరుణ**

ఆఫ్ఘానిస్తాన్ నేడు చరిత్రలోనే అత్యంత తీవ్రమైన ఆకలి సంక్షోభాన్ని అనుభవిస్తోంది. అంతర్జాతీయ ఆహార భద్రతా వర్గీకరణ సంస్థ (ఐపిసి) నివేదిక ప్రకారం 2 కోట్ల 29 లక్షల మంది అఫ్ఘన్లు మానవీయ సహాయం లేకుండా జీవించలేని స్థితిలో ఉన్నారు. వీరిలో 1 కోటి 26 లక్షల మంది తీవ్రమైన సంక్షోభ మరియు అత్యవసర స్థాయి ఆహార అభద్రతలో మగ్గుతున్నారు.

**(మూలం: ఐపిసి ఆఫ్ఘానిస్తాన్ నివేదిక 2025, ఐక్యరాజ్య సమితి)**

సేవ్ ది చిల్డ్రన్ అంతర్జాతీయ సంస్థ డిసెంబర్ 2025 నివేదిక ప్రకారం మూడు పిల్లలలో ఒకరు అంటే దాదాపు 90 లక్షల మంది పిల్లలు తీవ్రమైన ఆకలి సంక్షోభంలో ఉన్నారు. ఐదు సంవత్సరాల లోపు 37 లక్షల పిల్లలు తీవ్ర పోషకాహారలోపంతో అలమటిస్తున్నారు. ఏటా ఒక్కో సంవత్సరానికి ఈ సంఖ్య 18 శాతం పెరుగుతోంది. (మూలం: సేవ్ ది చిల్డ్రన్ ఇంటర్నేషనల్, డిసెంబర్ 2025)

యూనిసెఫ్ ఆఫ్ఘానిస్తాన్ 2025 నివేదిక ప్రకారం పోషకాహారలోపంతో అలమటిస్తున్న 37 లక్షల పిల్లలలో 85 శాతం మంది రెండేళ్ళు నిండని పసిపిల్లలే. 14 లక్షల మంది పిల్లలు మరణ ప్రమాదపు అంచున నిలబడ్డారు. (మూలం: యూనిసెఫ్ చైల్డ్ ఫుడ్ పావర్టీ రిపోర్ట్ ఆఫ్ఘానిస్తాన్ 2025)ఆడపిల్లలను అమ్ముకుంటున్నారు. 2 కోట్ల 80 లక్షల మంది పేదరికంలో కూరుకుపోయారు. ఒక ముద్దకోసం, ఒక మందుకోసం, ఒక అప్పు తీర్చుకోవడానికి - ప్రాణం పంచిన బిడ్డలను అపరిచితుల చేతులలో పెడుతున్నారు. (మూలం: ప్రొకేరళ న్యూస్, మే 2025 - అంతర్జాతీయ మీడియా నివేదికల సమాహారం)

ఇది చదివాక ఏ మనిషి గుండె రాయిలా ఉండగలదు?

భారతమాత - ఇప్పటికే ఆదుకున్న అమ్మ

భారతదేశం కేవలం మాటలలో మానవతావాది కాదు. చేతలలో నిరూపించిన విశ్వమాత.

వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం కాబుల్ 2023 నివేదిక ప్రకారం భారత ప్రభుత్వం ఇప్పటికే 50,000 మెట్రిక్ టన్నుల గోధుమలను యుఎన్ వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం ద్వారా ఆఫ్ఘానిస్తాన్ కు సరఫరా చేసింది. 2022 లో ఒక్క ఏడాది మాత్రమే ఆ గోధుమలు 47 లక్షల మంది ఆఫ్ఘన్ ప్రజలను కాపాడాయి. (మూలం: వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం ఆఫ్ఘానిస్తాన్ నివేదిక 2023)

స్టిమ్సన్ సెంటర్ నివేదిక ప్రకారం భారత మానవీయ సహాయంలో భాగంగా రోజూ 20 లక్షల మంది ఆఫ్ఘన్ పాఠశాల విద్యార్థులకు విటమిన్ సమృద్ధమైన బిస్కెట్లు అందించింది. ప్రతి నెలా 30,000 మంది ఆఫ్ఘన్ రోగులకు ఉచిత వైద్య సేవలు కల్పించింది. (మూలం: స్టిమ్సన్ సెంటర్ పరిశోధన నివేదిక)

2025 సెప్టెంబర్ లో ఆఫ్ఘానిస్తాన్ లో భూకంపం వచ్చినప్పుడు విదేశాంగ మంత్రి జైశంకర్ స్వయంగా 1,000 కుటుంబ గుడారాలు, టన్నుల కొద్దీ ఆహారం, మందులు వెంటనే పంపారు. (మూలం: భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటన, సెప్టెంబర్ 2025)ఇది భారత వారసత్వం. ఇది మన రక్తంలో ఉన్న మానవత.

**వృథా అన్నం - నిండని పొట్టలు**

ఏటా భారతదేశంలో కోట్ల టన్నుల ఆహారం గోదాముల్లో తడిసిపోతోంది. ఎలుకల పాలవుతోంది. చివరికి చెత్తలో పడిపోతోంది. ఆ వృథా అన్నం ఆఫ్ఘాన్ పిల్లలకు చేరితే సంవత్సరాల పాటు ఆ ఆకలి తీరిపోతుంది. అన్నపూర్ణ అయిన **భారతమాతకు ఇది అసాధ్యమా?**

ఆకలి తీర్చడం రాజకీయం కాదు - మానవతావాదం

శత్రువు ఆకలిపడినా అన్నం పెట్టే నాగరికత మనది. ఆఫ్ఘాన్ ప్రజలు భారతీయులను చరిత్ర పంచుకున్న మిత్రులుగా చూస్తారు. (మూలం: విజన్ ఐఏఎస్ కరెంట్ అఫైర్స్, మార్చి 2026 - ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వ్యాసం ఆధారంగా) నేడు వారి పిల్లలకు చేసే సహాయం రేపటి స్నేహానికి బీజం. నేడు ఆఫ్ఘాన్ పిల్లల పొట్ట నింపించే పిలుపు ఇవ్వడానికి భారత ప్రధాని ఒక్క నిర్ణయం చాలు. ఆ నిర్ణయం విన్న ప్రపంచం భారతదేశాన్ని కేవలం శక్తివంతమైన దేశంగా చూడదు- విశ్వానికి అన్నం పెట్టే అమ్మగా చూస్తుంది.ఆకలి బాధకు మతం లేదు. కులం లేదు. ప్రాంతం లేదు. సరిహద్దు లేదు. ఒక్క ముద్ద అన్నం - అది మానవత్వపు అక్షరం. భారతమాత ఆ అక్షరాన్ని ప్రపంచ చరిత్రలో లిఖించే సమయం ఇదే.

# కలకాలం గుర్తుండిపోవాలి



'ప్రేమలు' చిత్రంతో దక్షిణాది పరిశ్రమను ఒక్కసారిగా ఆకర్షించింది మలయాళీ సోయగం మమితా బైజు. ప్రస్తుతం ఈ భామ వరుస సినిమాలతో బిజీగా ఉంది. తమిళంలో సీఎం విజయ్‌తో కలిసి నటించిన 'జన నాయగన్' త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. తెలుగులో సూర్య సరసన 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంలో నటిస్తున్నది. ఇలా ఈ ముద్దుగుమ్మ సినిమాల లైనప్ భారీగానే ఉంది. అనతికాలంలో అగ్ర కథానాయికగా పేరు తెచ్చుకోవడం ఆనందంగా ఉందని, నటిగా తాను నిర్దిష్టమైన లక్ష్యాన్ని పెట్టుకున్నానని చెబుతున్నది మమితా బైజు. 'ఉత్తమ కథా చిత్రాల్ని ఎంచుకొని సవాళ్లతో కూడిన పాత్రలు చేయాలనుంది. నన్ను ఎప్పటికీ ఇష్టపడేలా అభిమానుల ప్రేమను పొందాలి. ఇండస్ట్రీ నుంచి రిటైర్ అయ్యాక గడచిపోయిన రోజులు గుర్తుకువస్తే హృదయం ఆనందంతో నిండిపోవాలి. నటిగా కలకాలం గుర్తుండిపోవాలి. అదే నా లక్ష్యం' అని చెప్పుకొచ్చింది మమితాబైజు.

# 'దృశ్యం 3' - మూవీ రివ్యూ!



మోహన్ లాల్ – జీతూ జోసెఫ్ కాంబినేషన్లో గతంలో మలయాళంలో వచ్చిన 'దృశ్యం' .. 'దృశ్యం 2' సినిమాలు భారీ విజయాలను అందుకున్నాయి. కథాకథనాల పరంగా ఈ రెండు సినిమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో గతంలోని కథకు కొనసాగింపుగా 'దృశ్యం 3' నిర్మితమైంది. అయితే ఈ సారి రీమేక్ గా కాకుండా, మోహన్ లాల్ నటించిన సినిమానే తెలుగు అనువాదంతో వదిలారు. ఈ రోజు (మే 21వ తేదీ)న ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేశారు.

జార్జ్ (మోహన్ లాల్) ఆయన భార్య రాణి (మీనా) పిల్లలు అంజూ – అనూ అందరూ కూడా గతం చేసిన గాయం నుంచి బయటపడటానికి ప్రయత్నిస్తూ ఉంటారు. సాధ్యమైనంత త్వరగా అంజూ వివాహం చేయాలని జార్జ్ దంపతులు నిర్ణయించుకుంటారు. భవిష్యత్తులో తన కూతుళ్లు ప్రమాదంలో పడకూడదనే ఉద్దేశంతో, అంజూకి ఫారిన్ సంబంధాలు చూడటం మొదలు పెడతాడు జార్జ్. అలాగే పైచదువుల కోసం అనూని విదేశాలకు పంపించాలని భావిస్తాడు. అయితే అంజూ మానసిక స్థితి సరిగ్గా లేదనే ప్రచారం కారణంగా సంబంధాలు వెనక్కిపోతుంటాయి. ఒక చిత్రమైన మానసిక సమస్య కారణంగానే,వరుణ్ అనే కుర్రాడిని అంజూ చంపేసిందనే ఒక వార్త షికారు చేస్తూ ఉంటుంది. అలా ప్రచారం చేస్తున్నది ఎవరో తెలియక జార్జ్ దంపతులు అయోమయంలో పడతారు .. ఆందోళన చెందుతూ ఉంటారు. ఈ పరిస్థితి నుంచి సాధ్యమైనంత త్వరగా బయటపడాలనే ఉద్దేశంతో ఉంటారు. ఇక వరుణ్ మర్డర్ కేసులో జార్జ్ ను పట్టించడానికి ప్రయత్నించి ఉద్యోగాన్ని పోగొట్టుకున్న సహదేవ్, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. వరుణ్ శవాన్ని జార్జ్ ఎక్కడ దాచాడనేది తెలుసుకుని, అతని కుటుంబానికి శిక్షపడేలా చేయాలనే కసితో ఉంటాడు. అందుకు తగిన ప్రయత్నాలు మొదలుపెడతాడు. ఇక జార్జ్ కారణంగా జాబ్ పోగొట్టుకున్న పోలీస్ ఆఫీసర్ రాజన్ ఫ్యామిలీ కూడా జార్జ్ ను శిక్షించాలనే పట్టుదలతో ఉంటుంది.

వరుణ్ ను కోల్పోయిన గీత – ప్రభాకర్ దంపతులు తేరుకోలేకపోతుంటారు. కొడుకును కోల్పోయి తాము బాధపడుతూ ఉంటే, కూతురుకి పెళ్లి చేయడానికి జార్జ్ ప్రయత్నిస్తూ ఉండటం వాళ్లకి మరింత ఆగ్రహాన్ని కలిగిస్తుంది. వరుణ్ హత్య కేసు విషయంలో ఆధారాలు సంపాదించాలనీ, జార్జ్ కూతురు పెళ్లి ఆగిపోయేలా చేయాలని ప్రభాకర్ భావిస్తాడు. ఇలా అంతా కలిసి ప్రతీకారంతో విసిరే వలలో జార్జ్ చిక్కుతాడా లేదా? అనేది మిగతా కథ. ఆర్థికపరమైన సమస్యలు .. ఆరోగ్యపరమైన సమస్యలు ఎన్ని ఉన్నప్పటికీ, అలాంటి వాటిని తట్టుకుని ఒక ఆడపిల్లకి తండ్రి పెళ్లి చేయగలడు. కానీ ఆడపిల్లల గురించి చెడుగా ప్రచారం చేసే వాళ్ల బారి నుంచి తప్పించుకుని, ఆ ఆడపిల్లను అత్తవారింటికి పంపించడం అంత తేలికైన విషయమేం కాదు. ఈ సినిమాలో కథానాయకుడు అలాంటి ఒక సమస్యను ఎలా అధిగమిస్తాడు? అందుకోసం అతను ఏం చేస్తాడు? అనే అంశం చుట్టూ ఈ కథ తిరుగుతూ ఉంటుంది. తన కూతురును .. కుటుంబ పరువు ప్రతిష్ఠలను కాపాడుకోవడం కోసం, ఒక మధ్యతరగతి తండ్రి చేసే పోరాటంగా గతంలో వచ్చిన కంటెంట్ కనిపిస్తుంది. ఇక ఈ సినిమా విషయానికి వచ్చేసరికి, ఆ ఆడపిల్లకు పెళ్లి చేయడానికి చేసే ప్రయత్నాల చుట్టూ తిరుగుతుంది. హత్యా నేరం కారణంగా అల్లరి పాలైన కథానాయకుడి కుటుంబం.. ఆడపిల్లకు పెళ్లి చేయాలనే ఆ దంపతుల తాపత్రయం చుట్టూ ఈ కథ పరిగెడుతుంది.

జార్జ్ తన పెద్ద కూతురికి పెళ్లి చేయడం కోసం చేసే ప్రయత్నాలు, ఆ విషయంలో ఆ కుటుంబానికి ఎదురవుతున్న ఆటంకాలను టచ్ చేస్తూ ఈ కథ ముందుకు వెళుతుంది. తన చుట్టూ ఏదో జరుగుతోంది .. గతాన్ని తవ్వడానికి ఎవరో పావులు కదుపుతున్నారనే సందేహం కథానాయకుడికి రావడం వంటి సన్నివేశాలతో ఫస్టాఫ్ నడుస్తుంది. ఇక శత్రువులంతా ఏకమై ఉచ్చు బిగించాలని అనుకున్నప్పుడు, తప్పించుకోవడానికి హీరో పడే పాట్లతో సెకండాఫ్ కొనసాగుతుంది. దృశ్యం .. దృశ్యం 2 సినిమాల మాదిరిగానే, హత్యా నేరం చుట్టూనే ఈ కథ తిరుగుతుంది. అయితే గతంలో వచ్చిన రెండు సినిమాలు మొదటి నుంచి చివరివరకూ ఎంతో ఆసక్తికరంగా సాగుతాయి. కానీ ఈ సినిమాకి అలా కుదరలేదు. ఫస్టాఫ్ చాలా నిదానంగా .. నింపాదిగా ఎలాంటి విషయం లేకుండానే సాగిపోతుంది. అసలైన కథ ఇంటర్వెల్ బ్యాంగ్ తరువాత నుంచే దర్శకుడు మొదలుపెట్టాడు. ఫస్టాఫ్ కంటే సెకండాఫ్ బాగుందని చెప్పగలం గానీ, గతంలో వచ్చిన రెండు సినిమాల స్థాయిలో ఉందని మాత్రం కచ్చితంగా చెప్పలేం. ఎందుకంటే ఆ స్థాయిలో కథలో ట్విస్టులు మనకి ఇందులో కనిపించవు. ఈ సినిమాలో ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ .. ఆ సమయంలో వచ్చే ట్విస్టులు కొంతవరకూ ఊరట కలిగిస్తాయి. అయినా మొదటి రెండు సినిమాల స్థాయిలో ఈ కంటెంట్ కనిపించదు. ఫస్టాఫ్ లో చాలా సమయాన్ని దర్శకుడు వృథా చేయడం సినిమాపై గట్టిగానే ప్రభావాన్ని చూపించిందని చెప్పాలి. సతీశ్ కురుప్ ఫొటోగ్రఫీ మంచి మార్కులు కొట్టేస్తుంది. కొన్ని షాట్స్ గొప్పగా అనిపిస్తాయి. అనిల్ జాన్సన్ నేపథ్య సంగీతం దృశ్యాలకు తగిన బలాన్ని ఇచ్చింది. వినాయక్ ఎడిటింగ్ ఫరవాలేదు. ఆర్టిస్టులంతా చాలా సహజంగా చేశారు. ఫస్టాఫ్ పలచగా ఉండటం .. సంభాషణలు పేలవంగా ఉండటం .. డబ్బింగ్ సంతృప్తికరంగా లేకపోవడం ఇతర లోపాలుగా కనిపిస్తాయి. మొదటి రెండు సినిమాల స్థాయిలో 'దృశ్యం 3' లేదనే చెప్పాలి.

## సినిమా లేకుంటే వ్యవసాయం




'గోకులంలో సీత' సినిమా చూసి నేను పవన్‌కల్యాణ్ అభిమానిగా మారాను. కొడుకు పుడితే ఆయన పేరే పెట్టుకోవాలనుకున్నా. 'తమ్ముడు' టైంలో మాకు అబ్బాయి పుట్టాడు. ఆయన పేరే పెట్టాను' అన్నారు నిర్మాత బత్తుల కోటేశ్వరరావు. ఆయన తనయుడు పవన్‌కల్యాణ్ హీరోగా పరిచయమవుతున్న 'పురుషః' చిత్రం ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకురానుంది. వీరు వులవల దర్శకుడు. ఈ సందర్భంగా బుధవారం నిర్మాత బత్తుల కోటేశ్వరరావు విలేకరులతో ముచ్చటించారు. హీరో అవ్వాలనే తన కలను కొడుకు ద్వారా నెరవేర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. తమ అబ్బాయికి సిగ్గు, బిడియం చాలా ఎక్కువని.. సినిమాల వల్ల కలుపుగోలుతనం పెరిగి కాన్ఫిడెంట్‌గా తయారవుతారనే ఉద్దేశ్యంతో వాడిని హీరో చేశానని చెప్పారు. "పురుషః' విభిన్నమైన కాన్సెప్ట్. ఆద్యంతం ప్రేక్షకుల్ని నవ్విస్తుంది. ముఖ్యంగా ప్రేమకథలోని కొత్తదనం ప్రేక్షకుల్ని ఎంతగానో ఆకట్టుకుంటుంది. వెన్నెల కిషోర్, వీటీవీ గణేష్, సప్తగిరి పండించే కామెడీ హైలైట్‌గా నిలుస్తుంది. మా అబ్బాయితో మూడు సినిమాలు చేస్తానని మాటిచ్చాను. సక్సెస్ అయితే ఓకే. లేకుంటే ఊరికి వెళ్లి వ్యవసాయం చేయాలని ముందుగానే చెప్పాను. ఈ చిత్రాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 300 థియేటర్లలో విడుదల చేస్తున్నాం. ఈ వేసవిలో చక్కటి వినోదం కోసం ఈ సినిమా చూడాలని ప్రేక్షకుల్ని కోరుతున్నా' అని బత్తుల కోటేశ్వరరావు అన్నారు.

## బ్రిటిష్ కాలం నాటి
# డేవిడ్ రెడ్డి




మంచు మనోజ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'డేవిడ్ రెడ్డి'. హనుమా రెడ్డి యక్కంటి దర్శకుడు. పాన్ ఇండియా సినిమా ఇది. దసరాకు ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా టీజర్‌ను విడుదల చేశారు. 1897–1920ల మధ్య జరిగిన ఈ కథలో అమాయక భారతీయుల్ని హింసిస్తున్న ఆంగ్లేయులపై ప్రతి దాడులు చేస్తూ హింసామార్గాన్ని ఎంచుకున్న డేవిడ్ రెడ్డి పాత్రలో కనిపించారు మంచు మనోజ్. 2 వేల మందిని ఒంటరిగా ఎదుర్కొన్న డేవిడ్‌రెడ్డిని తమవైపుకు తిప్పుకునేందుకు బ్రిటిషర్స్ ఎలాంటి ప్లాన్ చేశారు ఈ నేపథ్యంలో డేవిడ్ రెడ్డి ఏ నిర్ణయం తీసుకున్నాడు? అతను దేశాన్ని ఎందుకు మోసం చేయాలనుకున్నాడు? వంటి అంశాలతో టీజర్ ఆసక్తికరంగా సాగింది. డేవిడ్ రెడ్డి కాదు రాక్షస రెడ్డి అని బ్రిటిషర్స్ భయంతో చెప్పడం ఆయన పాత్ర తాలూకు ఇంటెన్సిటీని చూపించింది. యాక్షన్ సీక్వెన్స్ హైలైట్‌గా నిలిచాయి. మరియా ర్యాబోషాఫ్కా, రమ్యకృష్ణ, సముద్రఖని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, నిర్మాతలు: భరత్ మోటుకూరి, నల్లగంగుల వెంకట్‌రెడ్డి, దర్శకత్వం: హనుమా రెడ్డి యక్కంటి.

## 'డ్రాగన్' గ్లింప్స్‌తో ఎన్టీఆర్ సంచలనం..
### – యూట్యూబ్‌లో ఆల్ టైమ్ రికార్డ్!



యంగ్ టైగర్ ఎన్టీఆర్, సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న 'డ్రాగన్' సినిమాపై అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. తాజాగా ఎన్టీఆర్ 43వ పుట్టినరోజు సందర్భంగా మే 20న విడుదల చేసిన 'డ్రాగన్' ప్రిల్యూడ్ గ్లింప్స్ యూట్యూబ్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. విడుదలైన తొలి 24 గంటల్లోనే 64 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి, భారత సినీ చరిత్రలో ఒకే యూట్యూబ్ ఛానెల్‌లో అత్యధిక వ్యూస్ పొందిన గ్లింప్స్‌గా ఆల్ టైమ్ రికార్డును నెలకొల్పింది. 4 నిమిషాల 28 సెకన్ల నిడివి ఉన్న ఈ గ్లింప్స్‌ను తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేశారు. 1967 నాటి ప్రపంచ నల్లమందు వ్యాపార సామ్రాజ్యం నేపథ్యంలో కథ సాగుతుందని ఈ వీడియో ద్వారా స్పష్టం చేశారు. 'లూగర్' అనే క్రూరమైన పాత్రలో ఎన్టీఆర్ కనిపించనున్నారు. మరోవైపు నార్కోటిక్స్ బ్యూరో చీఫ్ రఘువీర్ రాథోడ్‌గా అనిల్ కపూర్ నటించడంతో ఇద్దరి మధ్య పోరు ఉత్కంఠ రేపుతోంది. ఈ సినిమా తాను తీసిన చిత్రాల్లోకెల్లా అత్యంత దేశభక్తి కలిగిన చిత్రమని, ఇందులో ఎన్టీఆర్ పాత్ర చాలా డార్క్‌గా ఉంటుందని దర్శకుడు ప్రశాంత్ నీల్ వెల్లడించారు. కేజీఎఫ్, సలార్ తరహాలోనే ఇందులో కూడా యాక్షన్ ఓ రేంజ్‌లో ఉండబోతున్నట్లు గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది. ఈ పాన్–ఇండియా ప్రాజెక్టులో రుక్మిణీ వసంత్, బిజు మీనన్, గురు సోమసుందరం, అశుతోష్ రాణా తదితరులు కీలక పాత్రలు పోషిస్తుండగా, రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.

## మెగా క్లాప్: 30 ఏళ్ల రివర్స్ సీన్..
## తమ్ముడి క్లాప్‌పై చిరంజీవి ఎమోషనల్ ట్వీట్!



మెగాస్టార్ చిరంజీవి 158వ సినిమా పూజా కార్యక్రమాలతో ఈరోజు లాంఛనంగా ప్రారంభమైంది. ఈ ఓపెనింగ్ వేడుకకు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. తన అన్నయ్య చిరంజీవిపై తీసిన ముహూర్తపు షాట్‌కు పవన్ కల్యాణ్ క్లాప్ కొట్టారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ క్లాప్ బోర్డ్ వెనుక ఉన్న ఒక అద్భుతమైన 30 ఏళ్ల నాటి విషయాన్ని గుర్తుచేస్తూ చిరంజీవి ఎక్స్‌లో ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టారు."ఈ రోజు కల్యాణ్ బాబుకి, నాకు మధ్యలో క్లాప్ కనిపిస్తుంటే... 30 సంవత్సరాల క్రితం ఇదే సీన్ రివర్స్‌లో జరిగిన సందర్భం గుర్తుకు వస్తోంది ... 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. ఈ రోజు డిప్యూటీ సీఎం హోదాలో టైమ్ తీసుకుని వచ్చి, నా 158వ సినిమా ముహూర్తంలో పాల్గొని, క్లాప్ ఇచ్చి యూనిట్ సభ్యులందరినీ ఆనందపరిచినందుకు థాంక్యూ" అని చిరంజీవి భావోద్వేగాన్ని వ్యక్తం చేశారు.ఫ్లాష్‌బ్యాక్: సరిగ్గా 30 సంవత్సరాల క్రితం, పవన్ కల్యాణ్ హీరోగా సినిమా ఇండస్ట్రీకి పరిచయమైన క్లాసిక్ మూవీ 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' (1996). ఆరోజు ఆ సినిమా ముహూర్తపు షాట్‌కు అన్నయ్యగా చిరంజీవి ముందుండి తమ్ముడు పవన్ కల్యాణ్‌కు క్లాప్ కొట్టి వెండితెరకు పరిచయం చేశారు. ఇవాళ అదే సీన్ రివర్స్ అయింది. ఆరోజు అన్నయ్య క్లాప్ కొట్టి తమ్ముడిని ఆశీర్వదించారు.

ఈరోజు తమ్ముడు ఏకంగా ఒక రాష్ట్రానికి డిప్యూటీ సీఎం హోదాలో వచ్చి.. అన్నయ్య 158వ సినిమాకు క్లాప్ కొట్టారు. మూడు దశాబ్దాలు గడిచినా, మెగా బ్రదర్స్ మధ్య ఉన్న అనుబంధం మాత్రం అలాగే ఉందనడానికి ఈ క్లాప్ బోర్డ్ విజువల్ ఒక పెద్ద నిదర్శనం.మరోవైపు, ఈ సినిమాకు బాబీ కొల్లి దర్శకత్వం వహిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. ఇందులో మలయాళ యువ నటి అనశ్వర రాజన్ కీలక పాత్ర పోషిస్తోంది.

# ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన సాధ్యం

**- వేములవాడ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ : చల్లా వెంకట్రాజం**

**- నార్కోటిక్ జాగిలంతో కిరాణా, పాన్ షాపుల్లో పోలీసుల తనిఖీలు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ రూరల్ మండల పరిధిలో డ్రగ్స్,గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు గురువారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ఆదేశాల మేరకు వేములవాడ రూరల్ ఎస్ఐ వెంకట్రాజం ఆధ్వర్యంలో గ్రామాల్లోని కిరాణా షాపులు, పాన్ షాపులు, బస్టాండ్ ప్రాంతాల్లో నార్కోటిక్ జాగిలంతో తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన, భద్రతా చర్యలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని వేములవాడ రూరల్ ఎస్ఐ వెంకట్రాజం తెలిపారు.

# విజయపురి కాలనీలో 'ఆల్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్' సమావేశం

**సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కదులుదాం: ముప్పు శ్రీనివాస్ రెడ్డి**



ఘట్ కేసర్ (ప్రశ్న న్యూస్) ఘట్కేసర్ సర్కిల్, నాగారం డివిజన్ పరిధిలోని ఎం ఎం సి ఆధ్వర్యంలో నాగరం, రాంపల్లి పరిసర కాలనీల ప్రతినిధులతో నిర్వహించిన కీలక సమావేశం విజయవంతమైంది. విజయపురి కాలనీలో 'ఆల్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్' ఆధ్వర్యంలో ఈ ఉమ్మడి సమావేశాన్ని గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా విజయపురి, హరితపురి, శివశక్తి సాయి, సింహపురి, విష్ణుపురి, భాగ్యనగర్, బాపూజీనగర్, వెంకటేశ్వర కాలనీలకు సంబంధించిన పలు ప్రజా సమస్యలపై స్థానిక నాయకులు, కాలనీ అధ్యక్షులు సుదీర్ఘంగా చర్చించారు. కాలనీల్లో నెలకొన్న మౌలిక వసతుల కొరత, రోడ్లు, డ్రైనేజీ, ఇతర ప్రధాన సమస్యలను త్వరితగతిన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని ఈ సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ముప్పు శ్రీనివాస్ రెడ్డి, కే. జీవన్ రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్, సాయినాథ్ గౌడ్, దేవివర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు మాట్లాడుతూ.. కాలనీల సర్వతోముఖాభివృద్ధికి, ప్రజల ఇబ్బందులను తొలగించడానికి అందరూ ఐక్యతతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తామని, అధికారులతో సమన్వయం చేసుకుంటూ కాలనీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ కాలనీల కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి

**సర్పంచ్ పూనెం కృష్ణ , ఉపసర్పంచ్ రత్నం కవిత , కాంగ్రెస్ పార్టీ నాయకులు**



భద్రాచలం(ప్రశ్న న్యూస్) ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కునవరం రోడ్ రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఆ మహానేతకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ , ఉపసర్పంచ్ రత్నం కవిత , కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ సమగ్రత, శాంతి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం జీవితాన్ని అంకితం చేసిన నాయకుడని స్మరించుకున్నారు.రాజీవ్ గాంధీ వర్ధంతిని దేశవ్యాప్తంగా ఉగ్రవాద వ్యతిరేక దినం గా పాటిస్తున్న సందర్భంగా ప్రతి భారతీయుడు హింసకు వ్యతిరేకంగా, శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. "సమైక్యతే మన శక్తి శాంతియుత భారతమే మన లక్ష్యం" అన్న దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రత్నం రమాకాంత్, కొండిశెట్టి కృష్ణమూర్తి, బొంబోతుల రాజీవ్, నర్రా రాము, అరికెల్ల తిరుపతి రావు, యూత్ కాంగ్రెస్ మండల కార్యదర్శి మాచినేని భాను, ఏలురి రాము , మహిళలు ములకలపల్లి మదారి తదితరులు పాల్గొన్నారు.

# లాభదాయక వ్యవసాయానికి సరైన పంటల ఎంపిక అవసరం

**- మార్కెట్ డిమాండ్ ఉన్న వరి రకాలనే సాగు చేయాలి**

**- వ్యవసాయ శాస్త్రవేత్త : డాక్టర్ కృష్ణ చైతన్య**

**- జాగిర్యాల్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం**



భీంగల్ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వం చేపడుతున్న 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం గురువారం నిజామాబాద్ జిల్లా,భీంగల్ మండలం, జాగిర్యాల్ గ్రామంలో గురువారం జరిగింది.

ఈ కార్యక్రమంలో చెరుకు, వరి పరిశోధనా స్థానం రుద్రూరు శాస్త్రవేత్తలు,వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంటల ఎంపిక, మార్కెట్ డిమాండ్, సేంద్రియ వ్యవసాయం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ, అధిక దిగుబడితో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి రకాలను సాగు చేయడం ద్వారా రైతులు మంచి ధరలు పొందవచ్చన్నారు. వ్యవసాయ శాఖ, విశ్వవిద్యాలయం సూచించిన నాణ్యమైన విత్తనాలనే ఉపయోగించాలని సూచించారు. అలాగే సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం ఉత్పత్తి సాధ్యమవుతుందని వివరించారు. మండల వ్యవసాయ అధికారి లావణ్య మాట్లాడుతూ, రాబోయే వానకాలం సీజన్‌లో ప్రభుత్వం సూచించిన సన్న రకాల వరి వంగడాలు బిపిటి-5204, ఆర్ఎన్ఆర్-15048, కేఎన్ఎం -1638, జైశ్రీరామ్, హెచ్ఎంటి, డబ్ల్యుజిఎల్-962, డబ్ల్యుజిఎల్-44, జేజిఎల్-1798తో పాటు దొడ్డు రకాలైన ఎల్ఆర్-64, ఎంటీయూ-1010, కేఎన్ఎం-118 మాత్రమే సాగు చేయాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎం.దివ్య, గ్రామ సర్పంచ్ గడాల ప్రసాద్, ఉప సర్పంచ్ భాస్కర్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ల వద్ద ప్రజలకు ఎండ తాకిడి లేకుండా ప్రత్యేక నీడ ఏర్పాట్లు: కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ (ప్రశ్న న్యూస్) ప్రస్తుతం నగరంలో కొనసాగుతున్న తీవ్రమైన ఎండల దృష్ట్యా ప్రజల సౌకర్యార్థం విజయవాడ నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టిందని, నగర పరిధిలో ఉన్న అన్ని అన్న క్యాంటీన్ల ముందు ప్రజలు ఎండలో ఇబ్బందులు పడకుండా తాత్కాలిక నీడ ఏర్పాట్లు చేసినట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ, బుధవారం రాత్రి నుండి మొదలుపెట్టి గురువారం ఉదయం కల్లా నగరంలోని 11 అన్న క్యాంటీన్ల వద్ద వీఎంసీ సిబ్బంది ప్రత్యేకంగా తాత్కాలికంగా నీడ కల్పించే ఏర్పాట్లు పూర్తి చేశారని, ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో అన్న క్యాంటీన్లకు అధిక సంఖ్యలో ప్రజలు వస్తారు కాబట్టి, క్యూలైన్లలో వేచి ఉండే సమయంలో ఎండ తీవ్రత వల్ల అసౌకర్యం కలగకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు ప్రజల ఆరోగ్యం మరియు సౌకర్యం మా ప్రాధాన్యతని, ఎండ తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో అన్న క్యాంటీన్ల వద్దకు వచ్చే ప్రజలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా నీడ ఏర్పాట్లు చేశారని, అలాగే త్రాగునీటి సరఫరాను కూడా పెంచి, క్యాంటీన్లకు వచ్చే వారి దాహార్తిని తీర్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.అదేవిధంగా నగరంలో హీట్‌వేవ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని, మధ్యాహ్న సమయంలో అవసరం లేకపోతే బయటకు రాకుండా ఉండాలని, తగినంత నీరు తీసుకోవాలని సూచించారు.

## రైతులు చనిపోయినా పట్టించుకోని ప్రభుత్వం..

**అన్ని కేంద్రాల్లో వెంటనే ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలి.**

**ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి..**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ డిప్యూటీ స్పీకర్ యం . పద్మ దేవేందర్ రెడ్డి విమర్శించారు. శంకరంపేట్ మండలం అంబాజీపేట గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం మండల నాయకులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురైన రైతు రాజయ్య ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని మండిపడ్డారు.వడ్లు కొనుగోలు చేసి సమయానికి మిల్లులకు తరలించకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. లారీలు సమయానికి రాకపోవడంతో కొనుగోలు ప్రక్రియ నిలిచిపోతుందని, అధికారులు సరైన సమన్వయం చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ముందుగానే ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించి ఉంటే రాజయ్య ప్రాణాలు నిలిచేవని అన్నారు.ధాన్యం డబ్బులు వస్తే రైతు అప్పులు తీర్చుకునేవాడని, రాజయ్య మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. రైతులు రోడ్లెక్కి ధర్నాలు చేసినా ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అన్ని కొనుగోలు కేంద్రాల్లో వెంటనే ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు కనీసం సమీక్ష సమావేశాలు నిర్వహించి ఎంత ధాన్యం కొనుగోలు అయింది, ఇంకా ఎంత నిల్వలో ఉంది, ఎన్ని లారీలు అవసరమో తెలుసుకోవడంలో కూడా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతులను ఆదుకునేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా కోరారు.వీరి వెంట శంకరంపేట్ మండల పార్టీ అధ్యక్షులు పట్లోరి. రాజు, గవ్వలపల్లి సర్పంచ్ సిద్ధిరాములు, మాజీ వైస్ ఎంపీపీ సత్య గౌడ్ మాజీ సర్పంచులు పోచయ్య దయానంద్ నాయకులు ప్రభాకర్ పడాల శ్రీనివాస్, మహేష్, కొమురయ్య, మల్లుపల్లి సర్పంచ్ నరేష్,రైతులు తదితరులు పాల్గొన్నారు .

# రీల్స్‌తో మెదక్ పర్యాటక అందాలను విశ్వవ్యాప్తం చేయాలి

**లోకల్ టు గ్లోబల్‌గా మెదక్ జిల్లా ఘన కీర్తిని ప్రపంచానికి తెలియజేయాలి**

**టూరిస్ట్ గైడ్ కోసం దరఖాస్తుల సమర్పించాలి**

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) ఇన్‌ఫ్లుయెన్సర్లు రీల్స్‌తో మెదక్.జిల్లా పర్యాటక అందాలను విశ్వవ్యాప్తం చేయాలని, లోకల్ టు గ్లోబల్‌గా మెదక్ జిల్లా ఘన కీర్తిని ప్రపంచానికి పరిచయం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు.గురువారం మెదక్ జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్'పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.మెదక్ జిల్లా టూరిజంను ప్రపంచానికి పరిచయం చేసేందుకు నిర్వహిస్తున్న ఈ కాంపిటీషన్‌పై ఇన్‌ఫ్లుయెన్సర్లు, మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా హ్యాండ్లర్లతో జిల్లా కలెక్టర్ ముఖాముఖి చర్చించారు. రీల్స్ కాంపిటీషన్ విధివిధానాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, బహుమతుల వివరాలు తదితర అంశాలను వారికి వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాలలో భాగంగా మొదటిసారిగా వినూత్న పద్ధతిలో మెదక్ జిల్లాలోని అనేక పర్యాటక ప్రాంతాలకు బ్రాండింగ్ కలిగించే విధంగా 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్' నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. మెదక్ జిల్లా పర్యాటక ప్రాంతాలపై 4ఖ వీడియో క్వాలిటీతో రీల్స్ సమర్పించాల్సి ఉంటుందని, ఆసక్తి కలవారు తమ వీడియోలను మే 21వ తేదీ నుంచి మే 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో సమర్పించవచ్చని, ఆన్‌లైన్ విధానంలో డీపీఆర్ఓ ఝుబ 9949922291, ఏపీఆర్ఓ బాబు 9701306838 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించవచ్చని పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి జూన్ 2వ తేదీన నగదు ప్రోత్సాహకాలు అందించబడుతుందన్నారు. మెదక్ జిల్లాలో ఆధ్యాత్మిక దేవాలయాలు, ప్రకృతి పర్యాటక కేంద్రాలు, జలపాతాలు, అభయారణ్య అందాలు, గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు కలగలిసి అనేక పర్యాటక ప్రాంతాలు ప్రకృతి వైవిధ్యభరితంగా నెలవై ఉన్నాయని పేర్కొన్నారు. జూన్ మాసం నుంచి పర్యాటక ప్రాంతాలకు ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు వచ్చే అవకాశం ఉంటుందని, వారందరికీ మెదక్ జిల్లా సాదర ఆహ్వానం పలుకుతుందన్నారు. రీల్స్ కాంపిటీషన్ ద్వారా మెదక్ జిల్లా పర్యాటక ప్రాంతాలకు మంచి బ్రాండింగ్ వచ్చే విధంగా పూర్తి వివరాలతో, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా రీల్స్‌ను రూపొందించాలన్నారు.పర్యాటక దినోత్సవ టూరిస్ట్ గైడ్ పోస్టర్ను ఆవిష్కరించారు. టూరిస్ట్ గైడ్ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు అట్టి దరఖాస్తులను నిబంధనలు మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, పాత్రికేయులు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, యూట్యూబర్స్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ సాంకేతికాభివృద్ధికి స్వర్గీయ రాజీవ్ గాంధీ కృషి ప్రశంసనీయం

**- బోయినిపల్లి సెస్ డైరెక్టర్ : కొట్టెపల్లి సుధాకర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని తడగొండ గ్రామంలో గురువారం స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 35వ వర్ధంతిని పురస్కరించుకొని ఘనంగా నివాళులర్పించారు. బోయినిపల్లి సెస్ డైరెక్టర్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ రాజన్న సిరిసిల్ల జిల్లా సభ్యులు కొట్టెపల్లి సుధాకర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కొట్టెపల్లి సుధాకర్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధికి సాంకేతిక రంగంలో కొత్త దిశను చూపారని అన్నారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం, సమాచార సాంకేతిక రంగానికి ప్రాధాన్యం ఇవ్వడం వంటి ఎన్నో కీలక నిర్ణయాలు ఆయన పాలనలో తీసుకున్నారని గుర్తుచేశారు. దేశ సమగ్రత, లౌకికవాద పరిరక్షణ కోసం రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

# అడుగుకో అవినీతి తిమింగలం

## - ఏసీబీ పట్టుకున్నా శిక్ష డౌటే

- ఏసీబీకి పట్టుబడితే టెర్మినేట్ చేయాలి
- ప్రభుత్వ అధికారులలో భారీగా పెరిగిన లంచాల వ్యవహారం
- అధికారుల అవినీతిని కట్టడిచేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం
- అటెండర్ నుంచి ఉన్నతాధికారి వరకు లంచాల దాహం
- ఇలా సస్పెండ్.. అలా జాయినింగ్ భయం ఎక్కడ?






హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ అధికారులు లంచాలు అంటే చాలు ఎంత నీచానికైనా దిగజారే పరిస్థితి నెలకొన్నది. ఇందుకు కారణం వాళ్లకు పడుతున్న శిక్షలు సరిగ్గా లేకపోవడమే దానికి తోడు ఇలా సస్పెండ్ చేయగానే, అలా జాయినింగ్ చేసుకోవడంతో పాటు నిబంధనలు కఠినంగా అమలు చేయకపోవడం, లక్షల జీతాలు తీసుకునే ఉన్నత అధికారులలో కూడా లంచాల వ్యవహారం అధికంగా ఉండడమే. దానికి తోడు పాలకులు కూడా అవినీతి అధికారులను శిక్షించకుండా రికమెండ్ చేస్తూ అవినీతి అధికారులను అడుగడుగునా రక్షిస్తున్నారు. హైదరాబాద్ జలమండలి జనరల్ మేనేజర్ కుమార్ నివాసాలపై జరిగిన ఏసీబీ దాడులు, అక్కడ బయటపడిన రూ. 100 కోట్ల అక్రమ ఆస్తుల ఉదంతం నగరంలో ప్రభుత్వ అధికారులలో అవినీతి ఏ స్థాయిలో వేళ్లూనుకుందో మరోసారి నిరూపించింది. నెలకు లక్షన్నర రూపాయల పరిమిత జీతం తీసుకునే ఒక ప్రభుత్వ ఉద్యోగి, కొద్ది సంవత్సరాల వ్యవధిలోనే ఇంతటి భారీ సామ్రాజ్యాన్ని ఎలా నిర్మించగలిగారనే ప్రశ్న సామాన్యుడిని విస్మయానికి గురిచేస్తోంది.

### - రియల్ ఎస్టేట్‌ను శాసిస్తున్న అవినీతి పెట్టుబడులు

హైదరాబాద్ మహానగర పరిధిలోని ప్రభుత్వ శాఖలైన జీహెచ్ఎంసీ, జలమండలి, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ , టౌన్ ప్లానింగ్ విభాగాల్లో అవినీతి అనేది ఒక సమాంతర ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందింది. లంచాల రూపంలో వస్తున్న ఈ అక్రమ సొమ్మంతా మెట్రో నగర శివార్లలోని రియల్ ఎస్టేట్ రంగంలోకి అడ్డూఅదుపూ లేకుండా ప్రవహిస్తోంది. ఐటీ కారిడార్‌లోని విలాసవంతమైన గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు, బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు, రీజినల్ రింగ్ రోడ్డు పరిసరాల్లోని వందలాది ఎకరాల ల్యాండ్ బ్యాంకులు మెజారిటీ భాగం ఇలాంటి కలుషిత సంపాదనతోనే కొనుగోలు చేస్తున్నారు. నిజాయితీగా సంపాదించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు లేదా వ్యాపారవేత్తల కంటే, ఇరుకు గదుల్లో కూర్చునే అవినీతి ప్రభుత్వ అధికారులే నేడు రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను శాసిస్తూ ధరలను కృత్రిమంగా పెంచుతున్నారు.

### - దాడుల హంగామా.. శిక్షల్లో శూన్యం

అక్రమార్కులను పట్టుకోవడానికి ఏసీబీ దాడులు నిర్వహిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ కేసుల పర్యవసానాలు శూన్యంగా మారుతున్నయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల వెలువడిన గణాంకాల ప్రకారం, తెలంగాణ ఏసీబీ నమోదు చేస్తున్న కేసుల్లో నిందితులకు కోర్టుల ద్వారా శిక్షలు పడుతున్న రేటు అత్యంత నిరాశాజనకంగా ఉంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో శిక్షల శాతం కేవలం 20 నుండి 25 శాతం లోపే ఉంటోంది. అంటే, పట్టుబడిన ప్రతి పది మంది అవినీతి అధికారుల్లో కనీసం ఏడుగురు చట్టంలోని లోపాల ద్వారా క్లీన్ చిట్‌తో బయటకు వస్తున్నారు లేదా కేసులను దశాబ్దాల పాటు సాగదీసి సాక్ష్యాలు లేకుండా చేస్తున్నారు. ఈ సేఫ్ ఎగ్జిట్ భరోసాయే అధికారులను మరింతగా బరితెగించేలా చేస్తోంది.

### - దర్యాప్తులో వ్యవస్థాగత లోపాలు

ఈ వైఫల్యానికి ప్రధాన కారణం ఏసీబీ దర్యాప్తులో కనిపిస్తున్న లోపాలు, పక్కా సాక్ష్యాధారాలను కోర్టుల ముందుంచలేకపోవడమే. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఆస్తుల విలువను కట్టేటప్పుడు దర్యాప్తు అధికారులు మార్కెట్ విలువను కాకుండా పాత రిజిస్ట్రేషన్ విలువను ప్రామాణికంగా తీసుకోవడం నిందితులకు మేలు చేస్తోంది. బినామీల పేరిట ఉన్న ఆస్తులకు, సదరు అధికారికి ఉన్న ఆర్థిక సంబంధాలను చట్టబద్ధంగా నిరూపించడంలో విఫలమవుతోంది. దీనికి తోడు, కేసు నమోదైన తర్వాత చార్జ్‌షీట్ దాఖలు చేయడానికే ఏసీబీకి సంవత్సరాల సమయం పడుతుండటంతో కీలక సాక్ష్యాలు కనుమరుగవుతున్నాయి.

### - రాజకీయ అండదండలు.. సెక్షన్ల మాయాజాలం

పట్టుబడిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంలో న్యాయస్థానాల్లో విచారణ జరపడానికి అవసరమైన ప్రభుత్వ అనుమతులు రావడంలో జరుగుతున్న జాప్యం అవినీతి నిరోధక చట్టం ఆత్మను దెబ్బతీస్తోంది. ఉన్నతాధికారుల, రాజకీయ నాయకుల అండదండలు ఉన్న లంచగొండులకు ఈ శాంక్షన్లు రాకుండా తెరవెనుక పెద్ద ఎత్తున లాబీయింగ్ సాగుతుంది. ఒకవేళ ఏసీబీ గట్టిగా ప్రయత్నించి సస్పెండ్ చేయించినా, కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే వారు ట్రిబ్యునళ్లు లేదా కోర్టుల నుండి స్టేలు తెచ్చుకుని, తిరిగి అదే శాఖల్లో కీలకమైన పోస్టుల్లో కొలువుదీరుతున్నారు. జలమండలి కేసులోనూ గతంలో ఇలాంటి అనుభవాలే వెలుగుచూశాయి.

### - మార్పు ఎక్కడ రావాలి.?

అవినీతి అధికారులు తమ సంపాదనను కేవలం నగదు రూపంలో కాకుండా, ఇతర దేశాల్లో పెట్టుబడులు, క్రిప్టో కరెన్సీ లేదా సుదూర ప్రాంతాల్లో బినామీల పేరుతో భూములుగా మారుస్తున్నారు. ఏసీబీ వద్ద ఉన్న పాత తరం దర్యాప్తు పద్ధతులు ఈ ఆధునిక వైట్ కాలర్ నేరాలను ఛేదించలేకపోతున్నాయి. ఫోరెన్సిక్ ఆడిటింగ్, డిజిటల్ ఎవిడెన్స్ సేకరణలో ఏసీబీ బలోపేతం కాకపోవడం వల్ల, కోర్టుల్లో నిందితుల తరపు న్యాయవాదులు సాంకేతిక కారణాలతో కేసులను కొట్టివేయించగలుగుతున్నారు.
దీనివల్ల పట్టుబడటం అనేది ఒక చిన్న ప్రమాదం మాత్రమే, శిక్ష పడటం అసాధ్యం అనే భావన అవినీతి తిమింగలాల్లో బలంగా బలపడింది. ఏసీబీ కేవలం దాడుల నాటి హంగామాకే పరిమితం కాకుండా, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా ఏడాది లోపే నిందితుల ఆస్తులను జప్తు చేసే అధికారాలను పొందాలి. పట్టుబడిన వెంటనే ఆస్తులను ప్రభుత్వ పరం చేసే విధానం వస్తేనే భయం మొదలవుతుంది.
ఏసీబీకి స్వయంప్రతిపత్తి కల్పించడంతో పాటు, ప్రాసిక్యూషన్ విభాగాన్ని అత్యున్నత స్థాయి న్యాయ నిపుణులతో బలోపేతం చేయాలి. అప్పుడే, లక్షల్లో జీతం ఉండి కోట్లలో అక్రమ ఆస్తులు కూడబెట్టే అధికారుల అక్రమ దాహానికి బ్రేకులు పడతాయన్న అభిప్రాయం ప్రజల నుండి వినిపిస్తోంది. మరి తెలంగాణ ప్రభుత్వం అవినీతిని కష్టడి చేయడానికి ఎలాంటి మార్పులు చేస్తుందో వేచి చూడాలి.

# గోవా ప్లస్‌గా సూర్యలంక బీచ్ ఫ్రంట్

## - సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల గ్రౌండింగ్ ఈ ఏడాది సెప్టెంబర్ కల్లా జరగాలని డిసెంబర్ 2028 కల్లా ప్రారంభమయ్యేలా చూడాలని మంత్రుల కమిటీ, అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్రం అనుసరిస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని ఆచరణలో చూపాలన్నారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలు, ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టులపై మంత్రుల కమిటీతో క్యాంపు కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంఓయూల స్థితిగతులు, ప్రాజెక్టుల పురోగతిపై ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చారు. మంత్రుల కమిటీ తీసుకున్న చర్యలు, ప్రస్తుత కార్యాచరణ, భవిష్యత్ ప్రాజెక్టుల గురించి వివరించారు. ఈ 23 నెలల్లో రూ.21,64,258 కోట్ల విలువైన మొత్తం 756 ప్రాజెక్టులు రాష్ట్రానికి వచ్చాయని, వీటితో 21,20,567 ఉద్యోగాలు వస్తున్నట్టు తెలిపారు. ప్రైవేటు రంగంలో ఏవియేషన్ ప్రాజెక్టులను ఆకర్షించేలా చర్యలు చేపడతామని లోకేష్ చెప్పారు. పెట్టుబడుల సాధనలో దేశంలోనూ, ప్రైవేటు రంగంలోనూ ఏపీ పేరు మార్మోగుతోందని, ఎంఎస్ఎంఈల అనుమతులు, ఇతర వివరాలను త్వరలోనే వెబ్ సైట్ ద్వారా అందిస్తామని లోకేష్ తెలిపారు.

### - 21 ప్రధాన ఆలయాలతో టెంపుల్ టూరిజం సర్క్యూట్

ప్రాజెక్టుల గ్రౌండింగ్, అనుమతుల వివరాలు, ఉద్యోగాల కల్పనపై సింగిల్ పోర్టల్‌లో డ్యాష్ బోర్డు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. భూ కేటాయింపుల్లో మొదటగా పర్యాటక ప్రాజెక్టులకు, తర్వాత ఐటీ కంపెనీలకు ప్రాధాన్యత కల్పించాలని సీఎం స్పష్టం చేశారు. టూరిజం, ఐటీ లాంటి ప్రాజెక్టులకు వినూత్నంగా మల్టీ పర్పస్ భవనాల నిర్మాణం చేపట్టే ఆలోచన చేయాలని సూచించారు. సూర్యలంక బీచ్ ఫ్రంట్ ను గోవా ప్లస్‌గా తీర్చిదిద్దేలా ప్రణాళికలు చేయాలని బాపట్ల బీచ్‌కు త్వరలో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏపీలోని 21 ప్రధాన ఆలయాలను కలుపుతూ టెంపుల్ టూరిజం ప్రాజెక్టు వేగంగా చేపట్టాలన్నారు. ఐటీ ప్రాజెక్టులు తమ కార్యకలాపాలు 18 నెలల్లో ప్రారంభించేలా చూడాలని స్పష్టం చేశారు. సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ తయారీ ప్రాజెక్టులను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు.

### - నౌకా నిర్మాణ రంగంలో విస్తృత అవకాశాలు

ట్రాన్స్‌మిషన్‌తో పాటు సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఏపీ నిర్దేశించుకున్న 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యాన్ని వేగంగా చేరుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. అయితే ఇప్పటికే 99 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ విద్యుత్ ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించేలా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు త్వరితగతిన ఏర్పాటయ్యేలా చూడాలని సీఎం అన్నారు. 2027 డిసెంబరు నాటికి 46 ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులు ఉత్పత్తి ప్రారంభించేలా నిరంతరం పారిశ్రామికవేత్తలతో సంప్రదింపులు చేయాలని సీఎం సూచించారు. షిప్ బిల్డింగ్ సెంటర్ నిర్మాణం, పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని చెప్పారు. నౌకా నిర్మాణ రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని స్పష్టం చేశారు. వైద్యారోగ్య రంగ ప్రాజెక్టులు రాష్ట్రంలో ఏర్పాటు కావాల్సి ఉందన్నారు. గడచిన 30 ఏళ్లుగా ఏపీలో భూసేకరణ గురించి వివాదాలు ఏర్పడలేదని, రైతులకు పరిశ్రమలకు, ప్రభుత్వానికి ప్రయోజనం కలిగేలా భూ సేకరణ ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

### - పర్యావరణ హితంగా ప్రాజెక్టులు

'రాష్ట్రంలో చేపట్టే ప్రాజెక్టుల్లో పర్యావరణ హిత టెక్నాలజీ వినియోగించాలని సీఎం సూచించారు. తీరప్రాంతాల్లో సముద్రంలోకి కాలుష్య కారకాలను విడిచిపెట్టకుండా చూడాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.సూర్యలంక, నెల్లూరు మైపాడు వంటి బీచ్ ప్రాంతాల్లో పరిశుభ్రమైన పరిస్థితులు ఉండాలన్నారు. కాలుష్యాన్ని సముద్రంలోకి విడిచిపెడితే భవిష్యత్తులో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పరిశ్రమలకు ఎస్క్రో ఖాతా ఏర్పాటు చేసే విషయంలోనూ త్వరితగతిన కార్యాచరణ చేపట్టాలన్నారు. ఎంఎస్ఎంఈ రైట్ టూ బిజినెస్ యాక్ట్ వెంటనే అమల్లోకి తీసుకురావాలని, నమోదు చేసుకుని పరిశ్రమ ప్రారంభించుకునేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. పరిశ్రమలు, ఎంఎస్ఎంఈల్లో తయారయ్యే ఉత్పత్తులు నాణ్యతపై దృష్టి పెట్టాలని ప్రోడెక్టు పర్ఫెక్షన్ పై ప్రత్యేకంగా ఫోకస్ చేయాలన్నారు. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ద్వారా ప్రాజెక్టులను సాకారం చేసేలా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

### - ఎస్ఐపీబీ ఆమోదం పొందిన ప్రాజెక్టుల్లో 114 గ్రౌండింగ్



రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.11.47 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి మొత్తం 282 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 4.32 లక్షల కోట్లు, 2025-26 ఆర్థిక సంవత్సరం -- రూ. 4.72 లక్షల కోట్లు, 2026-27లో (ఈనెల వరకు) -- రూ. 2.39 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. వీటిలో ఇప్పటికే 114 గ్రౌండింగ్ అయ్యాయి. 2026 సెప్టెంబర్ నాటికి అన్ని ప్రాజెక్టుల గ్రౌండింగ్ లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.
ఇందుకోసం పర్యావరణం సహా ఇతర అనుమతులు, విద్యుత్, నీరు, రహదారులు వంటి మౌలిక వసతులు, భూముల రిజిస్ట్రేషన్, స్థానిక సమస్యల పరిష్కారం వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. బీపీసీఎల్, ఇండోసోల్, శ్రీ సిటీ ఫేజ్-2 వంటి ప్రాజెక్టులకు భూసేకరణ అత్యంత వేగంగా కొనసాగుతోందని, బీపీసీఎల్ ప్రాజెక్టుకు అవసరమైన సుమారు 3,000 ఎకరాల్లో 2,000 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ కేవలం మూడు రోజుల్లో పూర్తి చేసినట్టు అధికారులు వివరించారు.

### -అంశాల పరిష్కారానికి మంత్రుల కమిటీ కృషి

పరిశ్రమల గ్రౌండింగ్ వేగవంతం కోసం మంత్రుల కమిటీ కృషి చేస్తుండగా, విదేశాల నుంచి రాష్ట్రంలో ఏర్పాటు చేసే పెట్టుబడుల వివరాలను ఈడీబీ సేకరిస్తోంది. అన్ని శాఖల పెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు ఐటీ పోర్టల్ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని మంత్రుల కమిటీ ఎప్పటికప్పుడు పెట్టుబడిదారులతో సమావేశాలు నిర్వహిస్తోంది.
ప్రాజెక్టుల వేగవంతమైన గ్రౌండింగ్ కోసం ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న పరిశ్రమలు నిర్దేశిత గడువులోగా కార్యకలాపాలు చేపట్టేలా చూడాలని మంత్రుల కమిటీకి సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశానికి మంత్రులు పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, బీసీ జనార్ధన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# బండి భగీరథ్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌కు హైకోర్టు అనుమతి


## - చెర్లపల్లి జైల్లో 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న భగీరథ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు సంబంధించిన పోక్సో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టయి ప్రస్తుతం జైల్లో ఉన్న భగీరథ్, రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకునేందుకు తెలంగాణ హైకోర్టు గురువారం అనుమతి ఇచ్చింది. భగీరథ్ తరఫు న్యాయవాది కరుణా సాగర్, తమ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతి కోరారు. మే 16న భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఈ పిటిషన్‌పై విచారణ అవసరం లేదని పేర్కొన్నారు. ఆయన విజ్ఞప్తిని అంగీకరించిన న్యాయస్థానం, పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతించింది. అదే సమయంలో రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకునేందుకు కూడా వెసులుబాటు కల్పించింది.మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడనే ఆరోపణలతో మే 8న పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. బాధితురాలి వాంగ్మూలం తర్వాత పోలీసులు పోక్సో చట్టంలోని కఠినమైన సెక్షన్లను కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఈ కేసులో అరెస్ట్ నుంచి మధ్యంతర రక్షణ కల్పించడానికి మే 15న హైకోర్టు నిరాకరించడంతో, మే 16న రాత్రి పోలీసులు భగీరథ్‌ను అరెస్ట్ చేశారు. అయితే, తన కుమారుడు స్వయంగా లొంగిపోయాడని బండి సంజయ్ తెలిపారు. భగీరథ్‌ను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. ప్రస్తుతం భగీరథ్ చెర్లపల్లి జైల్లో ఉన్నాడు.

# నేను ఢిల్లీకి రాగానే జైలుకు పంపుతారేమో అనిపిస్తోంది

## - కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు






న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) మన దేశంలో సునామీ సృష్టిస్తున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సంచలన వ్యాఖ్యలు చేశారు. "నేను అమెరికా నుంచి ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో అడుగుపెట్టగానే, పోలీసులు నన్ను నేరుగా తిహార్ జైలుకు తీసుకెళతారనిపిస్తోంది" అని బోస్టన్ యూనివర్సిటీలో చదువుతున్న ఆయన ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. నిరుద్యోగ యువతను బొద్దింకలతో పోల్చుతూ సీజేఐ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పుట్టిన ఈ వ్యంగ్య డిజిటల్ ఉద్యమం కేవలం 5 రోజుల్లోనే 1.4 కోట్లకు పైగా ఇన్స్టాగ్రామ్ ఫాలోయర్లతో బీజేపీ, కాంగ్రెస్ అకౌంట్లను దాటేసింది. గూగుల్ ఫామ్ ద్వారా ప్రారంభమైన ఈ పార్టీలో మహువా మోయిత్రా, మనీష్ సిసోడియా వంటి ప్రతిపక్ష నేతలు కూడా చేరారు. అయితే, లీగల్ డిమాండ్ల కారణంగా ఈ పార్టీ అధికారిక ఎక్స్ ఖాతాను భారతదేశంలో నిలిపివేస్తున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. దీనిపై అభిజీత్ స్పందిస్తూ "ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నారని నేనేమీ సంతోషంగా లేను. ఫాలోవర్లు పెరిగినంత మాత్రాన యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, పేపర్ లీకేజీలు వంటి అసలు సమస్యలు మారిపోవు కదా" అని విశ్లేషించారు. ఏది ఏమైనా కోట్ల ఫండింగ్ లేకుండా కేవలం మీమ్స్‌తో ఈ పార్టీ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను షేక్ చేస్తోంది.

# ఇద్దరిలో ఎవరు చెప్పింది నిజం

## - రేవంత్, బండిపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పోక్సో కేసు నిందితుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ అరెస్ట్ వ్యవహారం ఒక పెద్ద రాజకీయ రచ్చకు దారితీసింది. ఈ అరెస్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్‌పై బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... అసలు జరిగింది పోలీసు అరెస్ట్ కాదా? లాయర్ల సమక్షంలో జరిగిన సరెండరా? ఏది నిజం? అని ప్రశ్నించారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి అబద్ధం చెబుతున్నారా.. లేక కేంద్ర మంత్రి బండి సంజయ్ అబద్ధం చెబుతున్నారా? అని ఆయన నిలదీశారు. అసలేం జరిగిందంటే రేవంత్ రెడ్డి మాట్లాడుతూ "రోడ్డు మధ్యలో నాకాబందీ నిర్వహించి మరీ బండి భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో రాజకీయం లేదు, పోలీసుల మాట నమ్మాలి" అని స్పష్టం చేశారు. దీనికి భిన్నంగా నిన్న బండి సంజయ్ స్పందించారు. "నేనొక బాధ్యతాయుతమైన కేంద్ర మంత్రిగా, రాజకీయ నాయకుడిగా నా కొడుకును నేనే నా లాయర్ల ద్వారా పోలీసులకు సరెండర్ చేశాను" అని చాలా స్పష్టంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో "మనం రాష్ట్ర ముఖ్యమంత్రిని నమ్మాలా? లేక దేశ హోంశాఖ సహాయ మంత్రిని నమ్మాలా?" అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588